


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 113 | గురువారం 24 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## ఉద్యోగులకు డబుల్ బొనాంజా, కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు..



ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయాలు తీసుకుంది. బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. కేవలం ఒక్క సమావేశంలోనే ఏకంగా రూ. 22,171.84 కోట్ల విలువైన భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా, రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పాన్ని చాటిచెప్పింది. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 19,739 మంది యువతకు ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులకు రెండు డీఏలకు ఆమోదం తెలపడంతోటు, రాష్ట్రంలో కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నారు. క్యాబినెట్ సమావేశానంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు.

# శాప్ ఆఫీస్ వద్ద దాడి పై అన్ని ఆధారాలతో గవర్నర్‌కు ఫిర్యాదు

## డీఎస్సీ-2025 స్కామ్ పై సీబీఐ విచారణ జరిపించాలని కోరాం

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి వెల్లడి

విజయవాడ, సెప్టెంబర్ 23 వార్త సాక్ష్యం

లోక్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ని కలిసిన మాజీ ముఖ్యమంత్రి, వైయస్ జగన్మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఈనెల 21వ తేదీన శాప్ కార్యాలయం వద్ద వైయస్సార్ సీపీ నాయకుల పై జరిగిన దాడికి సంబంధించి పలు విషయాల ను గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం జరిగింది అలాగే, డీఎస్సీ-2025లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని కోరారు గవర్నర్‌తో భేటీ అనంతరం లోక్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 21న జరిగిన ఘటనపైనే కాకుండా, ఏ విధంగా డీఎస్సీ స్కామ్‌లో యువత నష్టపోయింది అనేది వివరించరు. ఈ వ్యవస్థలో ఒక మార్పు రావాలన్నా, ఈ వ్యవస్థ మీద ప్రజలకు మళ్లీ నమ్మకం రావాల న్నా, ఈ వ్యవస్థలో లోపాలు సవరించాలన్నా డీఎస్సీ స్కామ్‌పై కచ్చితంగా సీబీఐ విచారణ జరిపించే విధంగా - మిగతా6లో



## యెమెన్‌లోని జైలు పై సౌదీ వైమానిక దాడి జరిగిందని హౌతీల ఆరోపణ

- యెమెన్ జైలుపై సౌదీ దాడి.. 9 మంది ఖైదీల మృతి
- మరో దాడిలో ఇద్దరు చిన్నారులు సహా ఆరుగురు పౌరుల మృతి



2

## శ్రీలంకను వణికించిన మారణహోమం.. 15 మందికి 200 ఏళ్లకు పైగా జైలు శిక్ష

శ్రీలంకలో ఏడేళ్ల క్రితం పెను విషాదాన్ని మిగిల్చిన 2019 ఈస్టర్ ఆదివారం నాటి ఆత్మాహుతి బాంబు దాడుల కేసులో కొలంబో హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో 15 మందిని దోషులుగా నిర్ధారించిన ప్రత్యేక త్రిసభ్య ధర్మాసనం, వారికి 200 నుంచి 260 సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష విధించింది. - మిగతా2లో



## విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిపై మంత్రి నారా లోకేశ్ ఫోకస్.. అధికారులకు కీలక ఆదేశాలు



విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించి, విద్యావ్యవస్థలో మెరుగైన ఫలితాలు సాధించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, పాఠశాలల్లో యోగా శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల బలోపేతం వంటి కీలక నిర్ణయాలు తీసుకుంది. బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్.. పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య పరిరక్షణకు మిషన్ మోడ్‌లో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆదేశించారు.

## ఇది ఎల్ నినో కాదు.. కాంగ్-నినో

- రాష్ట్రంలో కరెంట్ కోతలకు 'కాంగ్-నినో' కారణమన్న కేటీఆర్
- కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయిందంటూ ప్రభుత్వానికి చురక
- సింగరేణి నుంచి 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆరోపణ



2

## ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వమే కారణమన్న కవిత



ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ లో చోటు చేసుకున్న ఏసీ పేలుడు ఘోర ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈ ఘటనలో ఐదుగురు పసికందులు మరణించడం - మిగతా2లో

## పాలమూరుకు ఉపశమనం.. కర్ణాటక నీటి విడుదల

తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు నీటి విడుదలకు కర్ణాటక సర్కార్ అంగీకారం తెలిపింది. అల్మట్టి నుంచి మూడు టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక సీఎం డీకే శివకుమార్ సానుకూలంగా స్పందించారు. అంతర్‌రాష్ట్ర జలాల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ బృందం.. కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో సమావేశం అయ్యారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు జి. మధుసూదన్ రెడ్డి, మేఘరెడ్డి ఉన్నారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ఆల్మట్టి నుంచి జూరాలకు నీటిని విడుదల చేయాలని ఇప్పటికే మంత్రులు వినతిపత్రం సమర్పించిన విషయం తెలిసిందే. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నీటి ఎద్దడి, పంటల ప్రస్తుత పరిస్థితులు వంటి - మిగతా2లో



VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# ఉద్యోగులకు డబుల్ బొనాంజా, కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు..

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి, గత వైసీపీ ప్రభుత్వంపై, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఒకవైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ అహర్నిశలు శ్రమిస్తూ, రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తుంటే, మరోవైపు ఐదేళ్ల విఫల నాయకుడు జగన్ రాష్ట్రంలో విధ్వంసం, అలజడి సృష్టించి పెట్టుబడిదారులను భయపెట్టాలని చూస్తున్నారు. గొడ్డలి పార్టీ నాయకుడి చర్యలు అత్యంత శోచనీయం. ప్రజాస్వామ్యాన్ని, ప్రజాతీర్పును గౌరవించకుండా అసెంబ్లీకి రాకుండా, తన ఇంటినే అసెంబ్లీగా మార్చుకుని, సొంత పత్రిక ద్వారా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి రాజకీయ పరిస్థితి దేశంలో మరే రాష్ట్రంలోనూ ఉండదు" అని పార్థసారథి తీవ్రంగా ధ్వజమెత్తారు. డీఎస్సీ నియామకాల విషయంలో కూడా చిన్న సమస్యలను పట్టుకుని యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా, కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అత్యున్నత స్థానానికి తీసుకెళ్లి తీరుతుందని ఆయన స్పష్టం చేశారు.

**కృష్ణా జిల్లాకు వరం.. మచిలీపట్నంలో గోవా షిప్‌యార్డ్**

కేబినెట్ నిర్ణయాల్లో అత్యంత కీలకమైనది కృష్ణా జిల్లాకు దక్కిన భారీ వరం. రక్షణ రంగంలో ప్రఖ్యాత ప్రభుత్వ రంగ సంస్థ అయిన గోవా షిప్‌యార్డ్, మచిలీపట్నంలో తమ నౌకా నిర్మాణ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.8,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ప్రభుత్వం ఈ సంస్థకు 400 ఎకరాల భూమిని, 1.7 కిలోమీటర్ల సముద్ర తీరాన్ని కేటాయించింది. ఇప్పటికే రూ.30,000 కోట్ల ఆర్డర్లతో ఉన్న ఈ సంస్థ వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని, దీనివల్ల ఒకవైపు పోర్టు, మరోవైపు షిప్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లతో కృష్ణా జిల్లా స్వరూపమే మారిపోతుందని మంత్రి పార్థసారథి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు సాధనలో కృషి చేసిన సీఎం చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

**పారిశ్రామిక, శాంతిభద్రతలపై కీలక నిర్ణయాలు**

పరిశ్రమలకు పెద్దపీట: ఎలక్ట్రానిక్స్ రంగంలో అగ్రగామి సంస్థ 'డిక్సన్', గత ప్రభుత్వ హయాంలో ఎంఓయూ చేసుకుని వెనక్కి వెళ్లిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో మళ్లీ ముందుకు వచ్చిందని మంత్రి తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో రాష్ట్రాన్ని హబ్‌గా మార్చే 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటుకు ప్రభుత్వం వసతులు కల్పించనుంది. కొత్త పోలీస్ కమిషనరేట్లు: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు, మారుతున్న నేరాల స్వరూపాన్ని ఎదుర్కొనేందుకు తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరం కేంద్రాలుగా నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఐజీ/డీఐజీ స్థాయి అధికారి కమిషనర్‌గా వ్యవహరిస్తారు. దీంతోపాటు సైబర్, సోషల్ మీడియా నేరాలను అరికట్టేందుకు ప్రతి జిల్లాలో 20 మందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ఉద్యోగులకు డబుల్ బొనాంజా: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సీఎం చంద్రబాబు తీపికబురు అందించారు. వారికి 1.7.2024 నుంచి 2.73%, 1.1.2025 నుంచి 1.82% చొప్పున రెండు విడతల కరవు భత్యం (డీఏ) మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

# ఇది ఎల్ నినో కాదు.. కాంగ్-నినో

రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది 'ఎల్ నినో' ప్రభావం కాదని, పాలకుల అసమర్థత వల్లే తలెత్తిన 'కాంగ్-నినో' (కాంగ్రెస్ నినో) అని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. "కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యుత్ కోతలు తప్పవని తాము ముందే హెచ్చరించామని, ఇప్పుడు అదే నిజమవుతోందని" కేటీఆర్ పేర్కొన్నారు. "కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది" అంటూ ఆయన ప్రభుత్వానికి చురకలంటించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ వ్యవస్థ అత్యంత పటిష్ఠంగా నడిచిందని, కానీ కాంగ్రెస్ పాలనలో పరిస్థితి దారుణంగా మారిందని విమర్శించారు. అనేక సబ్‌స్టేషన్ల పరిధిలో రోజుకు 6 గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని పత్రికల్లో వస్తున్న కథనాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యుత్ కోతలకు ప్రభుత్వం ఎల్ నినోను సాకుగా చూపుతోందని, అయితే అసలు కారణం ప్రభుత్వ వైఫల్యమేనని కేటీఆర్ ఆరోపించారు. జెన్‌కో వద్ద తగినంత బొగ్గు నిల్వలు లేవని, సింగరేణి నుంచి ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ థర్మల్ విద్యుత్ కేంద్రాలను, నీరు లేదన్న సాకుతో జల విద్యుత్ కేంద్రాలను మూసివేశారని దుయ్యబట్టారు. రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామన్న హామీని ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వమే కారణమన్న కవిత

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ లో చోటుచేసుకున్న ఏసీ పేలుడు ఘోర ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈ ఘటనలో ఐదుగురు పసికందులు మరణించడం అత్యంత ఆవేదన కలిగిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని సురక్ష చిల్డ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి తల్లిదండ్రులను నేడు ఆమె పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐదుగురు గిరిజన, మైనార్టీ పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతే కనీసం వచ్చి పరామర్శించే సమయం కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. వైఫల్యాలను ఎండగడుతూ, సీఎంకు నెల రోజుల గడువు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవధిలోగా ప్రభుత్వ ఆసుపత్రుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, గిరిజన గూడేలకు రహదారి సదుపాయాలు కల్పించాలని, కేంద్ర నిధుల వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులకు నిధులు కేటాయించకపోతే ఆదివాసీలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 'ఘెరావ్' చేపడతామని హెచ్చరించారు. రిమ్స్‌లో 150 ఏసీలు ఉన్నా ఒక్క మెకానిక్ కూడా లేకపోవడం, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో రూ.500 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వైద్యారోగ్య రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు.

# విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిపై మంత్రి నారా లోకేశ్ ఫోకస్.. అధికారులకు కీలక ఆదేశాలు

ఇందులో భాగంగా విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, పాఠశాలల్లో యోగా శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల బలోపేతం వంటి కీలక నిర్ణయాలు తీసుకుంది. బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్.. పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య పరిరక్షణకు మిషన్ మోడ్‌లో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. దీనికోసం అవగాహన, సంస్థాగత మద్దతు, మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం 'కేర్ ఏపీ' అనే టూల్‌ను సిద్ధం చేశామని, పైలట్ ప్రాజెక్టు కూడా పూర్తయిందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతగా 963 ప్రభుత్వ పాఠశాలల్లో 4.47 లక్షల మంది విద్యార్థులకు 'హార్ట్‌ఫుల్ యోగా' శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనం సంస్థ ద్వారా 2,000 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించనున్నామని, ఈ ఏడాది హైబ్రిడ్ పద్ధతిలో, వచ్చే ఏడాది నుంచి పూర్తిస్థాయిలో యోగా తరగతులు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. పాఠశాల విద్యలో సంస్కరణల దశ ముగిసిందని, ఇకపై అధికారులంతా ఫలితాలపైనే పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని లోకేశ్ స్పష్టం చేశారు. టెన్త్, ఇంటర్మీడియట్‌లో 90 శాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. 'మిషన్ మార్చ్' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న అధికారులను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. బోధనలో వెనుకబడిన ఉపాధ్యాయులకు మెంటార్ టీచర్లతో శిక్షణ తప్పనిసరి చేయాలన్నారు. యూనివర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకుల హాజరుశాతం పెంచేందుకు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ అమలు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమైన 'అక్షర ఆంధ్ర' ద్వారా వచ్చే ఏడాది చివరికల్లా నూరు శాతం అక్షరాస్యత సాధించాలని కోరారు. నైపుణ్యాభివృద్ధి శాఖపై సమీక్షించిన మంత్రి, పీఎం సేతు పథకం కింద పారిశ్రామికవేత్తల సహకారంతో తొలి విడతగా 10 పారిశ్రామిక అనుసంధానిత ఐటీఐ క్లస్టర్లను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. స్టీల్, రెన్యూవబుల్ ఎనర్జీ, ఆక్వా, ఫార్మా రంగాల సంస్థలతో సంప్రదించి 90 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. గత రెండేళ్లలో జాబ్ మేళాల ద్వారా 1.72 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని, మొత్తం 5.43 లక్షల మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చామని అధికారులు వివరించారు. ఇకపై జాబ్ మేళాల నిర్వహణలో శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని మంత్రి లోకేశ్ సూచించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పాలమూరుకు ఉపశమనం.. కర్ణాటక నీటి విడుదల

అంతర్రాష్ట్ర జలాల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ బృందం.. కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో సమావేశం అయ్యారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు జి. మధుసూదన్ రెడ్డి, మేఘరెడ్డి ఉన్నారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ఆల్మట్టి నుంచి జూరాలకు నీటిని విడుదల చేయాలని ఇప్పటికే మంత్రులు వినతిపత్రం సమర్పించిన విషయం తెలిసిందే. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నీటి ఎద్దడి, పంటల ప్రస్తుత పరిస్థితులు వంటి అంశాలను డీకే శివకుమార్‌కు మంత్రులు వివరించారు. మానవతా దృక్పథంతో పాలమూరు ప్రజలకు సాగు, తాగునీటిని విడుదల చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు కోరారు. మంత్రుల విజ్ఞప్తికి కర్ణాటక సీఎం అంగీకరించారు. నీటి విడుదలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆ రాష్ట్ర అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. నీటి విడుదలలో ఆలస్యం చేయకుండా వెంటనే చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి నిన్న తనకు ఫోన్ చేశారని తెలంగాణ ప్రజాప్రతినిధులకు డీకే శివకుమార్ వెల్లడించారు. తాను అసెంబ్లీలో ఉండటంతో రేవంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడలేకపోయానని డీకే వివరించారు. తిరిగి కాల్ చేసి చాలాసేపు మాట్లాడుకున్నామని చెప్పుకొచ్చారు. రెండు రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తే రైతుల అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు వెళ్లవచ్చని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా తెలంగాణకు నీటిని విడుదల చేస్తామని కర్ణాటక ఇరిగేషన్ అధికారులు చెప్పారు. కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం పై తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు.

## శ్రీలంకను వణికించిన మారణహోమం..

## 15 మందికి 200 ఏళ్లకు పైగా జైలు శిక్ష

ఈ కేసులో 15 మందిని దోషులుగా నిర్ధారించిన ప్రత్యేక త్రిసభ్య ధర్మాసనం, వారికి 200 నుంచి 260 సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష విధించింది. ఏడేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఈ తీర్పు వెలువడింది. మంగళవారం ఈ తీర్పును ప్రకటించిన కోర్టు, ప్రధాన నిందితుడిగా ఉన్న నౌఫర్ మౌలవితో పాటు మిగతా వారికి శిక్షలు ఖరారు చేసింది. దోషుల్లో ఒకరికి 260 ఏళ్లు, నలుగురికి 240 ఏళ్లు, ఐదుగురికి 220 ఏళ్లు, మరో ఐదుగురికి 200 ఏళ్ల చొప్పున జైలు శిక్ష విధించింది. ఇదే కేసులో సరైన ఆధారాలు లేకపోవడంతో మరో 9 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. దోషుల ఆస్తులను ప్రభుత్వ పరం చేయాలని కూడా న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణ సుమారు ఐదేళ్ల పాటు 547 రోజుల పాటు కొనసాగింది. ప్రాసిక్యూషన్ తరఫున మొత్తం 2,309 మంది సాక్షులను విచారించారు. నిందితులపై హత్య, ఉగ్రవాద కుట్ర, పేలుడు పదార్థాలు కలిగి ఉండటం వంటి సుమారు 23,270 నేరారోపణలు నమోదు చేశారు. వీటి ఆధారంగా ప్రివెన్షన్ ఆఫ్ టెర్రరిజం యాక్ట్ కింద వీరిని దోషులుగా నిర్ధారించారు. 2019 ఏప్రిల్ 21న ఈస్టర్ పండుగ రోజున శ్రీలంకలోని మూడు చర్చిలు, మూడు విలాసవంతమైన హోటళ్లపై ఏకకాలంలో ఆత్మాహుతి దాడులు జరిగాయి. ఐసిస్ ప్రేరణతో స్థానిక ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ 'నేషనల్ తౌహీద్ జమాత్' ఈ ఘాతుకానికి పాల్పడింది. ఈ మారణహోమంలో 45 మంది విదేశీయులు సహా సుమారు 270 మంది ప్రాణాలు కోల్పోగా, 500 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. శ్రీలంక అంతర్యుద్ధం ముగిసిన తర్వాత దేశంలో జరిగిన అత్యంత భయంకరమైన ఉగ్రదాడిగా ఇది నిలిచిపోయింది. దాడులను ముందుగా పసిగట్టడంలో విఫలమయ్యారన్న ఆరోపణలతో గత నెలలో ఇద్దరు మాజీ ఉన్నతాధికారుల కు కూడా కోర్టు శిక్ష విధించిన విషయం తెలిసిందే. తాజా తీర్పుతో బాధిత కుటుంబాలకు కొంత ఊరట లభించినట్లయింది. అయితే, దోషులు ఈ తీర్పుపై ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది.

## యెమెన్‌లోని జైలు పై సౌదీ వైమానిక దాడి జరిగిందని హౌతీల ఆరోపణ

యెమెన్‌లో తమ నియంత్రణలో ఉన్న ఒక జైలుపై సౌదీ అరేబియా వైమానిక దాడులకు పాల్పడిందని, ఈ ఘటనలో తొమ్మిది మంది ఖైదీలు మరణించారని హౌతీ రెబల్స్ మంగళవారం ఆరోపించారు. ఉత్తర యెమెన్ లోని అల్-జౌఫ్ ప్రావిన్స్ రాజధాని అల్-హజ్మ్‌లో సోమవారం రాత్రి ఈ దాడి జరిగినట్లు వారు వెల్లడించారు. ఇటీవల జరిగిన పోరాటాల్లో పట్టుబడిన ఖైదీలను ఈ జైలులో ఉంచినట్లు హౌతీలు పేర్కొన్నారు.ఈ దాడిని హౌతీల ఖైదీల వ్యవహారాల కమిటీ అధినేత అబ్దుల్ ఖాదర్ అల్-ముర్తాదా తీవ్రంగా ఖండించారు. జైలును లక్ష్యంగా చేసుకుని సౌదీ ఈ దాడులకు ఒడిగట్టిందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. మరణించిన వారి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. అయితే, ఈ ఆరోపణలపై సౌదీ అరేబియా నుంచి ఇప్పటివరకు ఎటువంటి అధికారిక స్పందన రాలేదు. ఇదే సమయంలో, తైజ్ ప్రావిన్స్‌లోని ఎర్ర సముద్ర తీర నగరం మోచాలో ఒక నివాస గృహం పై సౌదీ వైమానిక దాడులు జరిగాయని హౌతీ మీడియా మంగళవారం నివేదించింది. ఈ దాడిలో ఇద్దరు చిన్నారులు, ఒక మహిళ సహా మొత్తం ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, మరో ఎనిమిది మంది గాయపడినట్లు తెలిపింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను అల్-మసిరా టీవీ ప్రసారం చేసింది. సౌదీ అరేబియా,హౌతీల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ దాడులు చోటుచేసుకున్నాయి. సౌదీ వైమానిక దాడులకు ప్రతిగా హౌతీలు ఆ దేశ భూభాగంపైకి క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తున్నారు. సెప్టెంబర్ 10న మోచా పోర్టును హౌతీలు స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి వ్యూహాత్మక బాబ్ అల్-మందబ్ జలసంధి సమీపంలో పోరాటం మరింత తీవ్రమైంది.

## రాష్ట్రాల వారీగా బీజేపీ కొత్త ఇన్‌ఛార్జ్‌లు..

## తెలంగాణకు సునీల్ బన్సల్

ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ బుధవారం ఈ నియామకాలను ప్రకటించారు. అందులో భాగంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతి ఇరానీకి హరియాణా, ఛత్తీస్‌గఢ్ బాధ్యతలు అప్పగించగా.. ఆ రెండు రాష్ట్రాలకు సిద్ధార్థ్ శంభు కో-ఇన్‌ఛార్జ్‌గా నియమితులయ్యారు. తెలంగాణతో పాటు పశ్చిమ బెంగాల్ పార్టీ వ్యవహారాల బాధ్యతలను సునీల్ బన్సల్‌కు అప్పగించారు. తెలంగాణకు అభయ్ పాటిల్, రేఖా శర్మ కో-ఇన్‌ఛార్జ్‌లుగా నియమితులయ్యారు. బెంగాల్‌కు లాల్ సింగ్ ఆర్య, రాజేంద్ర సింగ్, పింకీ కుష్వాహ్ కో-ఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరించనున్నారు. దేశంలో కీలకంగా భావించే ఉత్తర్‌ప్రదేశ్ పార్టీ వ్యవహారాలను జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే పర్యవేక్షించనున్నారు. జగదీశ్ పటేల్, మేధా కులకర్ణి,ప్రదీప్ శర్మ, అనంత్ ఓజా సహకార బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మహారాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా బీజేపీ ఉపాధ్యక్షుడు బైజయంత్ జయ్ పాండా నియమితులవ్వగా.. అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తానవాడే, కమల్‌జీత్ సెహ్రావత్ కో-ఇన్‌ఛార్జ్‌లుగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక.. ఢిల్లీ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా సీనియర్ నేత వినయ్ సహస్రబుద్ధేను నియమించారు. జమ్యాంగ్ త్సెరింగ్ నంగ్యాల్, దర్శనా జర్దోష్ కో-ఇన్‌ఛార్జ్‌లుగా ఉంటారు. బీజేపీ మరో ఉపాధ్యక్షుడైన రామ్ మాధవ్‌కు ఉత్తరాఖండ్ బాధ్యతలు అప్పగించగా.. అరవింద్ మీనన్, బాన్సురీ స్వరాజ్ ఆయనకు అసోసియేట్స్‌గా నియమితులయ్యారు.ఈ జాబితాలో తమిళనాడు బాధ్యతలను రామ్ మాధవ్‌కు కాకుండా ఇతర నాయకులకూ అప్పగించారు. మరోవైపు.. పార్టీ కమ్యూనికేషన్ విభాగంలోనూ మార్పులు చోటుచేసు కున్నాయి. జాతీయ మీడియా విభాగం, సోషల్ మీడియా యూనిట్‌ను కలుపుకునే కమ్యూనికేషన్ విభాగానికి అనిల్ బలూనీ సమన్వయకర్త నియమితులయ్యారు. ఇటీవల నేషనల్ మీడియా విభాగం కో-కన్వీనర్‌గా నియమితులైన ఆషిశ్ ఉషా అగర్వాల్‌కు కన్వీనర్ బాధ్యతలు అప్పగించారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# సంపాదకీయం

## రాహులే మోదీ విజయ రహస్యం!




పావు శతాబ్ది క్రితం నాటి మాట. 2001 అక్టోబర్ 1న న్యూఢిల్లీలో ఉన్న నరేంద్రమోదీ ఫోన్ మోగింది. 'ఎక్కడున్నారు?' అని అడిగిన ప్రశ్న విని మోదీ చకితులయ్యారు. ఎందుకంటే ఆ స్వరం ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయిది. 'శ్మశానంలో ఉన్నాను' అని మోదీ జవాబిచ్చారు. వాజపేయి దిగ్భ్రాంతి చెందారు. 'అక్కడేం చేస్తున్నారు?' అని అడిగారు. 'నిన్న విమాన ప్రమాదంలో మరణించిన కాంగ్రెస్ నేత మాధవరావు సింధియాతో పాటు నా మిత్రుడు, ఫొటో జర్నలిస్టు గోపాల్ భిస్త్ కూడా మరణించాడు. అతడి అంత్యక్రియలకు వచ్చాను' అని మోదీ చెప్పారు. 'సరే, సాయంత్రం రండి..' అని వాజపేయి ఫోన్ పెట్టేశారు. సాయంత్రం తనను కలిసిన మోదీని చూడగానే వాజపేయి నవ్వుతూ 'ఢిల్లీలో పంజాబీ తిండి బాగా ఒంటబట్టినట్లుంది. మీకిక్కడ ఏమీ పనిలేదు. గుజరాత్‌కు వెళ్లి అక్కడ పనిచేసుకోండి' అని చెప్పారు. వాజపేయి ఏమంటున్నారో మోదీకి మొదట అర్థం కాలేదు. అప్పటికే ఆయన ఆరేళ్లుగా ఢిల్లీలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా వివిధ రాష్ట్రాల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 'గుజరాత్‌లో ఏమి చేయాల్సి ఉంటుంది సార్' అని వాజపేయిని మోదీ అడిగారు. 'ఏం చేస్తారు? ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టాలి' అని అటల్జీ అన్నారు. మోదీ ఉబ్బితబ్బిబ్బయ్యారు. తనకు అంత పెద్ద బాధ్యత అప్పగిస్తారని ఆయన ఊహించలేదు. 'నేను ఇంతవరకూ అసెంబ్లీ ముఖమే చూడలేదు. ముఖ్యమంత్రి కార్యాలయంలోకి అడుగు పెట్టలేదు. ఆరేళ్లుగా అక్కడేం జరుగుతున్నదో నాకు తెలియదు' అని మోదీ అన్నారు. 'నేను కూడా మొదటిసారి ఢిల్లీ వచ్చినప్పుడు నాకిక్కడ ఎవరూ తెలియదు' అని వాజపేయి చమత్కరించారు.మోదీ వెన్వెంటనే తనకు మార్గదర్శకుడైన లాల్‌కృష్ణ ఆద్వాణీ ఇంటికి వెళ్లారు. 'అటల్జీ అంతా చెప్పారు కదా' అని ఆయన అనేసరికి మోదీ ఆశ్చర్యపోయారు. తనను గుజరాత్ పంపాలన్న ఆలోచన వాజపేయి ఒక్కరిదే కాదని ఆయనకు అర్థమైంది. అప్పటి ఆరెస్సెస్, సర్ సంఘ్ చాలక్ సుదర్శన్, సంస్థాగత ప్రధాన కార్యదర్శి మదన్‌దాస్ దేవి, సీనియర్ నేత దత్తోపంత్ ఠేంగ్డీలతో చర్చించిన తర్వాతే తాను, వాజపేయి కలిసి నిర్ణయం తీసుకున్నామని మోదీకి ఆద్వాణీ చెప్పారు. ఆ తరువాత అశోకా రోడ్‌లోని బీజేపీ కార్యాలయానికి మోదీ వెళ్లారు. అక్కడ విలేఖర్లతో మాట్లాడుతూ 'నేను మళ్లీ గుజరాత్‌లో అడుగుపెడుతున్నాను' అని మందహాసంతో చెప్పారు. పత్రికా గోష్ఠిని ముగిస్తూ ప్రతి ఒక్కరితో కరచాలనం చేశారు. అప్పట్లో ఆయనకు విలేఖర్లతో మంచి సంబంధాలు ఉండేవి. విలేఖర్ల సమావేశంలో మాట్లాడేందుకు ఇతర నేతలతో పోటీపడేవారు. ఆ తర్వాత అంత హాయిగా ఆయన మాట్లాడడాన్ని నేనెప్పుడూ చూడలేదు. మోదీని ముఖ్యమంత్రిగా గుజరాత్ పంపాలని బీజేపీ అగ్రనేతలు నిర్ణయం తీసుకోవడానికి ముఖ్య కారణాలున్నాయి. గుజరాత్‌లో పార్టీ అగ్రనేతలు కేశుభాయి పటేల్, శంకర్‌సింగ్ వాఘేలాల మధ్య అంతర్గత చిచ్చు నేపథ్యంలో మోదీ 1995లో ఢిల్లీ రావాల్సి వచ్చింది. 1998 ఫిబ్రవరిలో జరిగిన శాసనసభ,లోక్‌సభ ఎన్నికల్లో గుజరాత్‌లో పార్టీని గెలిపించేందుకు ఆయన విశేష కృషి చేశారు. మోదీ ప్రాధాన్యాన్ని గుర్తించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు కుశాభావు ఠాక్రే ఆయనను గోవిందాచార్య, వెంకయ్యనాయుడు, సుమిత్రా మహాజన్‌లతో పాటు పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. 2000లో బంగారు లక్ష్మణ్ అధ్యక్షుడైన తర్వాత కూడా మోదీని తన టీమ్‌లో కొనసాగించారు. ఈ మధ్య కాలంలో గుజరాత్‌లో పార్టీ పరిస్థితి బాగా బలహీనపడింది. పటిష్ఠ పాలననందించడంలో కేశుభాయి పటేల్ వైఫల్యం, తీవ్ర కరువు తాండవించడం, భుజ్‌లో భయానక భూకంపం సంభవించినప్పుడు ప్రభుత్వం సరైన సహాయక చర్యలు చేపట్టలేకపోవడంతో బీజేపీ ప్రతిష్ఠ తీవ్రంగా దిగజారింది. స్థానిక ఎన్నికల్లో పార్టీ ఘోరంగా దెబ్బతింది. మొత్తం 25 జిల్లా పంచాయతీల్లో 23 పంచాయతీలను బీజేపీ కోల్పోయింది. పట్టణ ప్రాంతాల్లో కూడా బీజేపీ పట్టు కోల్పోసాగింది. 2001 సెప్టెంబర్‌లో ఆద్వాణీ ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని సబర్మతితో సహా రెండు స్థానాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో పార్టీ ఘోరంగా ఓడిపోయింది. గుజరాత్‌లో నాయకత్వ మార్పు జరగాల్సిందేనని పార్టీ పరిశీలకులు మదన్ లాల్ ఖురానా, కుశాభావు ఠాక్రే నివేదిక సమర్పించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే వాజపేయి, ఆద్వాణీల నిర్ణయం మేరకు 2001 అక్టోబర్ 7న మోదీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నరేంద్రమోదీ సుదీర్ఘకాలం ముఖ్యమంత్రి పదవిలో కొనసాగడమే కాకుండా ప్రధానమంత్రి అవుతారని, అధికారంలో పాతికేళ్ల ప్రస్థానం పూర్తి చేస్తారని వాజపేయి, ఆద్వాణీలు ఆ రోజు బహుశా ఊహించి ఉండకపోవచ్చు.

# బౌద్ధ ధర్మం నూతన మానవ నిర్మాణ శక్తి ఉంది

**– బౌద్ధ ధర్మం పై డా. బి.ఆర్. అంబేద్కర్ ఆలోచన**

మానవ సమాజంలో సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం, న్యాయం వంటి విలువలు స్థిరపడాలంటే కేవలం చట్టాలు మారడం మాత్రమే సరిపోదు. మనిషి ఆలోచనా విధానం, నైతిక ప్రవర్తన, ఇతర మనుషుల పట్ల చూసే దృక్పథం కూడా మారాలి. ఈ మానవ పరివర్తనకు బౌద్ధ ధర్మంలో గొప్ప శక్తి ఉందని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వసించారు. అంబేద్కర్ దృష్టిలో బౌద్ధం కేవలం ఆచారాలు, కర్మకాండలు, మూఢనమ్మకాలతో కూడిన మతం కాదు. అది మనిషిని కేంద్రంగా చేసుకున్న నైతిక జీవన విధానం. మనిషి తన బుద్ధి, వివేకం, కరుణ, నైతికత ఆధారంగా జీవించాలని బౌద్ధ ధర్మం బోధిస్తుందని ఆయన భావించారు.

**అంబేద్కర్‌కు బౌద్ధ ధర్మం ఎందుకు ఆకర్షణీయమైంది?**

డాక్టర్ అంబేద్కర్ జీవితమంతా కుల వివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. ఆయనకు సమాజంలో సమానత్వం కేవలం రాజకీయ హక్కుగా కాకుండా, ప్రతి మనిషి గౌరవానికి సంబంధించిన అంశంగా కనిపించింది. కుల వ్యవస్థ మనుషులను జన్మ ఆధారంగా ఉన్నత--నీచ స్థాయిలుగా విభజిస్తుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. దీనికి ప్రత్యామ్నాయంగా స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం ఆధారంగా సమాజాన్ని నిర్మించాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. అంబేద్కర్ బౌద్ధ ధర్మంలో ఈ విలువలకు అనుకూలమైన నైతిక పునాది ఉందని చూశారు. అందుకే ఆయన 1956లో బౌద్ధ ధర్మాన్ని స్వీకరించి, తన అనుచరులతో కలిసి ఒక చారిత్రక సామాజిక పరివర్తనకు శ్రీకారం చుట్టారు.

**బౌద్ధం అంటే మానవత్వం**

అంబేద్కర్ ఆలోచనలో బౌద్ధ ధర్మానికి కేంద్రబిందువు మనిషి. మనిషి దుఃఖాన్ని అర్థం చేసుకోవడం, దానికి కారణాలను తెలుసుకోవడం, దుఃఖ నివారణకు నైతిక మార్గాన్ని అనుసరించడం బౌద్ధ బోధనలో ముఖ్యమైన అంశాలు. ప్రజ్ఞ, కరుణ, సమత వంటి విలువలు వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాకుండా సమాజాన్ని కూడా మార్చగలవని అంబేద్కర్ భావించారు. మనిషి ఇతరుల బాధను తన బాధగా భావించి, ద్వేషానికి బదులుగా కరుణను, వివక్షకు బదులుగా సమానత్వాన్ని, మూఢనమ్మకాలకు బదులుగా వివేకాన్ని ఎంచుకుంటే సమాజంలో మానవ సంబంధాలు మారుతాయి.

**“మనిషిని మార్చే ధర్మం” అనే భావన**

అంబేద్కర్ దృష్టిలో నిజమైన ధర్మం మనిషి నైతిక జీవితాన్ని మెరుగుపరచాలి. ధర్మం పేరుతో ఒక మనిషిని మరొక మనిషి కంటే ఉన్నతుడిగా లేదా తక్కువవాడిగా చూడటం ఆయన ఆలోచనకు విరుద్ధం. బౌద్ధ ధర్మం వ్యక్తిని తన ఆలోచనలు, చర్యలు, నైతిక బాధ్యతల గురించి ఆలోచించేలా చేస్తుంది. అందువల్ల బౌద్ధం బయటి ప్రపంచాన్ని మాత్రమే మార్చే సిద్ధాంతం కాకుండా, మనిషి అంతర్గత ఆలోచనా ప్రపంచాన్ని కూడా మార్చే మార్గంగా అంబేద్కర్ చూశారు.

**కుల వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా సమానత్వం**

భారతదేశ సామాజిక చరిత్రలో కుల వ్యవస్థ ఒక దీర్ఘకాలిక సమస్యగా కొనసాగింది. కులం ఆధారంగా మనిషి విలువను నిర్ణయించడం సామాజిక న్యాయానికి విరుద్ధమని అంబేద్కర్ భావించారు. బౌద్ధ సంఘంలో వ్యక్తి జన్మ



ఆధారంగా కాకుండా తన నైతిక జీవనం, సాధన ఆధారంగా గుర్తింపును పొందే సంప్రదాయం ఉందని ఆయన ప్రాముఖ్యతనిచ్చారు. అందువల్ల కుల ఆధారిత అసమానతలకు వ్యతిరేకంగా బౌద్ధం ఒక ప్రత్యామ్నాయ మానవతా దృక్పథాన్ని అందించగలదని ఆయన విశ్వసించారు.

**స్వేచ్ఛ -- సమానత్వం -- సోదరభావం**

అంబేద్కర్ సామాజిక ప్రజాస్వామ్యానికి మూడు ప్రధాన విలువలను ప్రాధాన్యంగా చూశారు:

**స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం.**

ఈ మూడు విలువలు పరస్పరం విడదీయరానివని ఆయన భావించారు. చట్టం ముందు అందరూ సమానులైనా, సమాజంలో పరస్పర గౌరవం లేకపోతే నిజమైన ప్రజాస్వామ్యం బలపడదు. బౌద్ధ ధర్మంలోని కరుణ, మైత్రీ, సమత భావనలు సోదరభావంతో కూడిన సమాజ నిర్మాణానికి నైతిక ఆధారాన్ని అందించగలవని అంబేద్కర్ భావించారు.

**మూఢనమ్మకాలకు బదులు వివేకం**

అంబేద్కర్ బౌద్ధ ధర్మంలో మరో ముఖ్యమైన అంశంగా వివేకం మరియు పరిశీలనా దృక్పథాన్ని చూశారు. మనిషి ఏ విషయాన్నైనా ఆలోచించి, పరిశీలించి, అనుభవం మరియు తర్కం ఆధారంగా అర్థం చేసుకోవాలనే దృక్పథం ఆయనకు ముఖ్యమైనది. అందువల్ల బౌద్ధ ధర్మాన్ని ఆయన కేవలం విశ్వాస వ్యవస్థగా కాకుండా, నైతికత మరియు వివేకంతో కూడిన జీవన విధానంగా పునర్వ్యాఖ్యానించారు.

**నవయాన బౌద్ధం**

అంబేద్కర్ బౌద్ధాన్ని స్వీకరించినప్పుడు దానిని తన సామాజిక తత్వంతో అనుసంధానించి కొత్త దృక్పథాన్ని ప్రతిపాదించారు. ఆయన బౌద్ధ ఆలోచనలను సామాజిక సమానత్వం, న్యాయం, నైతికత, మానవ గౌరవం వంటి అంశాలతో అనుసంధానించారు. ఈ దృక్పథాన్ని సాధారణంగా నవయాన బౌద్ధంగా పేర్కొంటారు. 1956 అక్టోబర్ 14న నాగ్‌పూర్‌లో అంబేద్కర్ బౌద్ధ ధర్మాన్ని స్వీకరించడం భారత సామాజిక చరిత్రలో ఒక ముఖ్యమైన సంఘటనగా నిలిచింది. ఆయనతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారు.

**నూతన మానవ నిర్మాణం**

“బౌద్ధ ధర్మం నూతన మానవ నిర్మాణ శక్తి” అనే భావనలో ప్రధానమైనది మనిషి ఆలోచనలో మార్పు.

కులం, ద్వేషం, అసూయ, వివక్ష, మూఢనమ్మకం, హింస వంటి వాటి స్థానంలో–

- **మానవ గౌరవం**
- **సమానత్వం**
- **కరుణ**
- **మైత్రీ**
- **వివేకం**
- **నైతిక బాధ్యత**
- **సామాజిక న్యాయం**

వంటి విలువలు పెంపొందితే ఒక కొత్త మానవ వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుంది. అందుకే అంబేద్కర్ దృష్టిలో బౌద్ధ ధర్మం కేవలం వ్యక్తిగత విముక్తికి సంబంధించినది కాదు; సమానత్వం ఆధారంగా సమాజాన్ని పునర్నిర్మించే నైతిక శక్తిగా కూడా అర్థం చేసుకోవచ్చు.

**నేటి సమాజానికి అంబేద్కర్ బౌద్ధ ఆలోచనల ప్రాసంగికత**

సాంకేతికంగా ప్రపంచం ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ, సామాజిక వివక్ష, అసమానత, ద్వేషం, హింస వంటి సమస్యలు వివిధ రూపాల్లో కొనసాగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో మనిషిని మనిషిగా గౌరవించడం, భిన్నత్వాన్ని అంగీకరించడం, ఇతరుల పట్ల కరుణతో వ్యవహరించడం వంటి విలువలకు ప్రాధాన్యత మరింత అవసరం.

**అంబేద్కర్ బౌద్ధ ఆలోచనలు మనకు ఒక ప్రశ్నను ముందుకు తెస్తాయి:**

“సమాజాన్ని మార్చాలంటే ముందుగా మనిషి ఆలోచనను ఎలా మార్చాలి?”

ఈ ప్రశ్నకు బౌద్ధ ధర్మంలోని ప్రజ్ఞ, కరుణ, సమత వంటి విలువలు ఒక నైతిక మార్గాన్ని సూచిస్తాయి.

ముగింపు

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బౌద్ధ ధర్మాన్ని స్వీకరించడం ఒక వ్యక్తిగత ఆధ్యాత్మిక నిర్ణయంగా మాత్రమే చూడలేం. ఆయన దృష్టిలో అది సామాజిక సమానత్వం, మానవ గౌరవం, నైతికత మరియు వివేకం ఆధారంగా కొత్త సమాజ నిర్మాణానికి సంబంధించిన ఒక ముఖ్యమైన ఆలోచనా ప్రక్రియ. మనిషిని జన్మతో కాకుండా మానవత్వంతో చూడడం, వివక్షకు బదులుగా సమానత్వాన్ని, ద్వేషానికి బదులుగా కరుణను, మూఢనమ్మకాలకు బదులుగా వివేకాన్ని పెంపొందించడం–ఇదే అంబేద్కర్ బౌద్ధ ఆలోచనలోని ప్రధాన సందేశంగా చెప్పవచ్చు. అందువల్ల “బౌద్ధ ధర్మం నూతన మానవ నిర్మాణ శక్తి” అనే భావన నేటికీ సామాజిక న్యాయం, మానవ గౌరవం, సమానత్వం గురించి ఆలోచించేందుకు ఉపయోగపడే ఒక ముఖ్యమైన అంబేద్కర్ దృక్పథంగా నిలుస్తుంది.

వ్యాసకర్త
న్యాయవాది కోడి మోహన్ రావు



# సేవా సంకల్ప అభియాన్‌లో విద్యార్థులకు పోటీలు








**– బిజెపి పార్టీ శ్రీశైలశీ అసెంబ్లీ ఇంచార్జి మోమిన్ షబానా**

**ఆత్మకూరు సెప్టెంబర్ 23 వార్త సాక్ష్యం**

సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా బుధవారం పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్‌లో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, వక్తృత్వ (ఉపన్యాస) పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం శ్రీశైలం నియోజకవర్గం BLA–1 అసెంబ్లీ ఇన్‌చార్జ్ మోమిన్ షబానా ఆధ్వర్యంలో నిర్వహించారు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల విద్య శాఖ అధికారిని, పాఠశాల ప్రిన్సిపాల్, ఆత్మకూరు పట్టణ అధ్యక్షులు రవీంద్రారెడ్డి , మార్కెట్ డైరెక్టర్ పద్మావతి, పట్టణ ఉపాధ్యక్షులు శేఖర్,నూర్ అహ్మద్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత,ఆత్మవిశ్వాసం,వక్తృత్వ నైపుణ్యాలను పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం

# సిపిఐ నాయకులను అడ్డగించడం సరికాదు

**- గోరుకల్లు వరద నీటిలో నష్టపోయిన ప్రజలకు నష్ట పరిహారం అందించాలి**
**- ఆత్మకూరు సిపిఐ తాలూకా కార్యదర్శి టి.ప్రతాప్**

ఆత్మకూరు సెప్టెంబర్ 23 వార్త సాక్ష్యం




నంద్యాల జిల్లా గోరకల్లు రిజర్వాయర్ నీటిని వదలడం వల్ల నష్టపోయిన గ్రామ ప్రజలను సందర్శించడానికి వెళ్లిన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు తో పాటు తోపాటు సిపిఐ ప్రతినిధి బృందాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు అడ్డగించి గ్రామంలోకి రాకూడదని అడ్డుకోవడం పట్ల బుధ వారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆత్మకూరు సిపిఐ తాలూకా కార్యదర్శి టి.ప్రతాప్ ఖండించారు. గోరుకల్లు రిజర్వాయర్ గత అనేక సంవత్సరాల నుండి లీకేజీ వల్ల ఆ గ్రామం ప్రజలు నిరంతరం ఇబ్బందులు పడుతున్నారు లీకేజీ కాకుండా పూర్తిస్థాయిలో దాన్ని నిర్మించి దాని నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యం చేయడంతో పాటు రిజర్వాయర్ సామర్థ్యానికి మించి నీటిని నిలువ ఉంచడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అనవసరంగా రిజర్వాయర్ నుండి నీటిని దిగువకు వదలడం తో గ్రామంలోకి నీరు ప్రవేశించి గ్రామ ప్రజలు అర్ద రాత్రిపూట భయభ్రాంతులకు గురయ్యారు. ఎగువన అలగనూరు రిజర్వాయర్ గత 6 సం. రాల నుండి పడిన గండిని పుడ్చకపోవడంతో ఈ రిజర్వాయర్ పై నీటి నిల్వ వత్తిడి పెరిగింది. ఆ గండిని కేవలం 34 కోట్లు కేటాయించి పూడ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. గోరుకల్లు నీటి వరద వల్ల నష్టపోయిన గ్రామ ప్రజలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించి ఇక నుండి రిజర్వాయర్ వద్ద నిరంతరం పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని సిపిఐ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.

# క్రీడల కోటా ఉపాధ్యాయుల పై దాడి చేసిన వారిని శిక్షించాలి ఏపీటీఎఫ్

ఆత్మకూరు సెప్టెంబర్ 23 వార్త సాక్ష్యం




మెగా డిఎస్సి క్రీడల కోటా కింద ఎంపికైన ఉపాధ్యాయుల పై దాడి చేసినవారి ని కఠినంగా శిక్షించాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షులు, ఎం.ఎస్.ఉమ్మర్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పట్టణంలోని ఏపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఆత్మకూరు డివిజన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ మెగా డీఎస్సీలో అక్రమాలు జరగలేదని తెలుపుట కొరకు శాంతియుతంగా విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులపై దాడి చేయుటను ఆంధ్రప్రదేశ్ టీచర్ ఫెడరేషన్ జిల్లా పక్షాన ఖండిస్తున్నాం, ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం ప్రతిపక్ష నాయకులు మానుకోవాలి, డీఎస్సీలో అక్రమాలు జరిగాయి అనడం రాజకీయ దురుద్దేశం తో కూడుకున్నదిగా ఉన్నది, డీఎస్సీలో అక్రమాలు జరిగి ఉంటే సాక్షా ధారాలతో చట్టసభలలో గానీ , న్యాయ పోరాటం చేయాలి గాని ఇలా కష్టపడి ఉపాధ్యాయ ఉద్యోగం తెచ్చుకున్న వారిపై దాడులకు దిగడం ప్రతిపక్ష నాయకులు దిగజారిన రాజకీయాలు చేయడమే అవుతుంది.భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వం ఉపాధ్యాయ భద్రత చట్టాలు తీసుకురావాలి, ఉపాధ్యాయుల భద్రతకు ఏ పి టి ఎఫ్ అండగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశం లో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు తులసిస్వరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు . శ్రీనివాసులు, ఇక్బాల్ బాషా,కన్వీనర్ . అబ్దుల్ వాహిద్, జిల్లా కౌన్సిలర్లు సుబ్రహ్మణ్యం, రామాంజనేయులు, విధు భూషణ్, వెంకటరమణ, ఆత్మకూరు, కొత్తపల్లి మండల అధ్యక్షులు అంబయ్య, చిన్న కృష్ణయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి మండలంలోని, కేజీబీలో ఇంటర్ విద్యార్థిని మృతి - సూసైడ్ నోట్ స్వాధీనం

**- మృతికి కారణాలపై అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు**
**- కుటుంబ సభ్యుల ఆరోపణలపైనా ఆరా**
**- ఆత్మకూరుడీఎస్పీ ఆర్.రామాంజినాయక్**

ఆత్మకూరు సెప్టెంబర్ 23 వార్త సాక్ష్యం








కొత్తపల్లి మండలంలోని, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న భవ్య అనే విద్యార్థిని మృతి చెందిన ఘటన కలకలం లేపడంతో ఆత్మకూరు ఆర్డీవో వెంకటకృష్ణ, డీఎస్పీ ఆర్.రామాంజీ నాయక్, రూరల్ సిఐ ఎం.సురేష్ కుమార్ రెడ్డి, ఆత్మకూరు ఎస్సై నారాయణరెడ్డి, కొత్తపల్లి తహసిల్దార్, ఎస్సై జయ శేఖర్, తదితరులు వచ్చి, అన్ని వివరాలు సేకరిస్తున్నారు. తమ కుమార్తె మృతికి దారితీసిన పరిస్థితుల పై పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. పాఠశాల యాజమాన్యం నుంచి తమకు సకాలంలో సమాచారం అందలేదని వారు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విద్యార్థిని రాసినట్లు భావిస్తున్న సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. నోట్‌లో విద్యార్థిని తనకు సన్నిహితంగా ఉన్న మరో విద్యార్థినితో ఏర్పడిన మనస్పర్థలు,వాటి కారణంగా తాను తీవ్రంగ బాధప డుతున్నట్లు పేర్కొన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అయితే నోట్‌లోని అంశాల ఆధారంగా మాత్రమే మృతికి కారణాన్ని నిర్ధారించకుండా, ఘటనకు దారితీసిన అన్ని పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పాఠశాల యాజమాన్యం వ్యవహరించిన తీరు,విద్యార్థినికి ఎదురైన పరిస్థితులు, ఘటనకు ముందు చోటుచేసుకున్న పరిణామాలపై వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆత్మకూరు డీఎస్పీ ఆర్.రామాంజి నాయక్ మాట్లాడుతూ విద్యార్థిని రాసిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నామని, ఘటనపై కట్టుదిట్టంగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు వెలుగు లోకి వచ్చిన అనంతరం బాధ్యులుగా ఎవరైనా తేలితే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తల్లిదండ్రులకు తమ కుమార్తె ఉన్నత చదువులు చదివి మంచి భవిష్యత్తు సాధిస్తుందని ఆశించిన తమకు ఈ విషాద ఘటన తీవ్రంగా కలచివేసిందని కుటుంబ సభ్యులు, కన్నీరు మున్నీరవు తున్నారు. తమకు సకాలంలో సమాచారం అందించ లేదన్న ఆరోపణలపైనా అధికారులు విచారణ జరిపిం చాలని వారు కోరుతున్నారు. వసతి గృహాల్లో తల్లిదండ్రులకు దూరంగా చదువుతున్న విద్యార్థినుల ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు కనిపించినప్పుడు, ఉపాధ్యాయులు, వార్డెన్లు అప్రమత్తంగా ఉండి అవసరమైన సమయంలో తల్లిదండ్రులకు సమా చారం అందించాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు. విద్యార్థినుల భద్రతతో పాటు వారి మానసిక స్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసు కోవాలని తెలిపారు. అయితే ఈ ఘటనకు అసలు కారణం ఏమిటి, పాఠశాల యాజమాన్యం వైపు నుంచి ఏమైనా నిర్లక్ష్యం జరిగిందా, ఇతర పరిస్థితులు ఏమైనా ప్రభావం చూపాయా, అనే అంశాలు పోలీసుల దర్యాప్తులో నిజాలు తేలాల్సి ఉంది. పోలీసులు ఈ కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి, బాలిక కుటుంబానికి న్యాయం చేస్తామని డిఎస్పి తెలియజేశారు

# అక్షరాలతో లక్షల వ్యాపారం శ్రీ చైతన్య హై స్కూల్...!

ఆత్మకూరు సెప్టెంబర్ 23 వార్త సాక్ష్యం




పట్టణంలోని శ్రీ చైతన్య హై స్కూల్‌లో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడం, పుస్తకాల పేరుతో అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆత్మకూరు విద్యాశాఖ అధికారి MEO-1 మేరీ మేరీ మార్గేట్ కు బుధవారం,ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వేటూరి రంగస్వామి వినతిపత్రం ఇచ్చారు అనంతరం వారు మాట్లాడుతూ శ్రీ చైతన్య స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వివిధ రకాల ఫీజుల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయని ముఖ్యంగా పుస్తకాల పేరుతో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై అధికారులు సమగ్రంగా విచారణ చేయాలని కోరారు అలాగే పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సరైన మౌలిక వసతులు, క్రీడామైదానం, పార్కింగ్ స్థలం వంటి సౌకర్యాలు ఉన్నాయా లేదా అనే అంశాలను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించాలని కోరారు. పాఠశాలలో విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ప్రతి తరగతికి సంబంధించిన ఫీజుల మొత్తం, ఇతర ఛార్జీల పూర్తి వివరాలను నోటీస్ బోర్డుపై స్పష్టంగా ప్రదర్శించేలా పాఠశాల యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరారు ఫీజుల విషయంలో తల్లిదండ్రులకు పూర్తి పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు పాఠశాలను తనిఖీ చేసి, ఫీజుల వసూళ్లు, పుస్తకాల పేరుతో తీసుకుంటున్న మొత్తాలు, మౌలిక వసతులు, క్రీడామైదానం, పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ నాయకులు ప్రవీణ్ పాల్గొన్నారు.

## కొత్తపల్లి కేజీబీవీ విద్యార్థిని భవ్య మృతిపై సమగ్ర విచారణ జరపాలి: విద్యార్థి సంఘాల డిమాండ్




కొత్తపల్లి సెప్టెంబర్ 23 వార్త సాక్ష్యం

కొత్తపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని భవ్య మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని ఐసా - ఎస్ఎఫ్ఐ - ఆర్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ముందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఐసా రాష్ట్ర కార్యదర్శి స్వామిదాసుగారి నాగార్జున, ఎస్ఎఫ్ఐ

జిల్లా ఉపాధ్యక్షులు దినేష్,ఆర్ఎస్ఎఫ్

జిల్లా అధ్యక్షులు రంగస్వామి సందర్భంగా మాట్లాడుతూ..విద్యార్థి భవ్య మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. పాఠశాల సిబ్బంది చెబుతున్న అనారోగ్య సమస్యలు, ప్రేమ వ్యవహారాలు అనేవి కేవలం బాధ్యత నుండి తప్పించుకోవడానికి చెప్తున్న కట్టుకథలని వారు కొట్టిపారేశారు.విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకపోవడం వెనుక ఉన్న అసలు కారణాలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు.పాఠశాల ఇన్‌ఛార్జ్ ఎస్ఓ , ఆ సమయంలో డ్యూటీలో ఉన్న టీచర్ల మరియు సిబ్బంది నిర్లక్ష్యం వల్లే భవ్య ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు కోల్పోయిందని నాయకులు ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సదరు సిబ్బందిని తక్షణమే విధుల నుండి తొలగించడమే కాకుండా, వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ గారు ఈ ఘటనపై తక్షణమే స్పందించి, బాధితురాలి కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి న్యాయం చేయాలని, లేనిపక్షంలో పాఠశాల విద్యార్థులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు మండల కార్యదర్శి సాయి కుమార్ నాయకులు ప్రవీణ్, సంజయ్,తరుణ్ ఐసా నాయకులు వర్ధన్, శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరమ్మ మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం

**- గోవర్ధన్ రెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పరామర్శ**




సెప్టెంబర్ 23 వార్త సాక్ష్యం

బాపట్ల మాజీ శాసనసభ్యులు శ్రీ చీరాల గోవర్ధన్ రెడ్డి గారి సతీమణి శ్రీమతి చీరాల వెంకటేశ్వరమ్మ గారు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడం పట్ల బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ వేగేశన నరేంద్ర వర్మ రాజు గారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ మేరకు బుధవారం కర్లపాలెంలోని గోవర్ధన్ రెడ్డి గారి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు గారు, వెంకటేశ్వరమ్మ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విషాదం లో ఉన్న మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన్ రెడ్డి గారిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జీవిత భాగస్వామిని కోల్పోయిన గోవర్ధన్ రెడ్డి గారి బాధను పంచుకుంటూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. వెంకటేశ్వరమ్మ గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో కర్లపాలెం మండల పార్టీ అధ్యక్షుడు షేక్ బాజీ, బాపట్ల పార్లమెంటు ఉపాధ్యక్షుడు మద్దాల ముసలయ్య, క్లస్టర్ ఇంచార్జ్ నక్కల వెంకటస్వామి తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెలుగోడు లో స్వచ్ఛత నీరు

వార్త సాక్ష్యం సెప్టెంబర్ 23 వెలుగోడు :



వెలుగోడు లోని పలు కాలనీల్లో స్వచ్ఛత నీరులో భాగంగా సుబ్రమైన ఫిల్టర్ నీరు వస్తుంది అని ప్రజలు వాపోతున్నారు. ఇటువంటి నీరు తాము ఎపుడు తాగలేదని బ్లీచింగ్ పౌడర్ కూడా చాలా బాగా కలిపారని ప్రజలు వ్యక్తం చేశారు. ఇలాటి మురుగు నీరు వదిలేకంటే నీరు వదలకుండా ఉండడం మంచిదని వాపోతున్నారు. ఈ నీరు తగలెమని స్వచమైన నీరు అందించాలని వెలుగోడు ప్రజలు వాపోతున్నారు.

వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# బయోచార్‌తో భూసార పరిరక్షణకు ప్రాధాన్యత

- పంట అవశేషాలను సద్వినియోగం చేసుకుని రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి
- నంద్యాల జిల్లాలో తొలిసారిగా పైలట్ ప్రాజెక్టుకు కార్యాచరణ
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల, సెప్టెంబర్ 23 వార్త సాక్ష్యం

భూసార పరిరక్షణతో పాటు పంట అవశేషాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు బయోచార్ వినియోగాన్ని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. నంద్యాల జిల్లాలో ఈ తరహా కార్యక్రమాన్ని తొలిసారిగా చేపట్టేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆమె అధికారులను, సంబంధిత కోర్ టీమ్ సభ్యులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో బయోచార్ వినియోగం, భూసార పరిరక్షణ, పంట అవశేషాల సద్వినియోగం పై సంబంధిత కోర్ టీమ్‌తో జిల్లా కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా బయోచార్ తయారీ విధానం, వ్యవసాయ భూముల్లో దాని వినియోగం, రైతులకు కలిగే ప్రయోజనాల పై సమగ్రంగా చర్చించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల వాతావరణంలోకి కార్బన్ ఉద్గారాలు పెరిగే అవకాశం ఉన్నందున, వాటిని సద్వినియోగం చేసుకునే ప్రత్యామ్నాయ పద్ధతులపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.కోంటికి' (ఖశీత్‌ఱనెఱ) వంటి పరికరాలను ఉపయోగించి ఆక్సిజన్ పరిమిత



పరిస్థితుల్లో పంట అవశేషాలను ప్రాసెస్ చేసి బయోచార్‌గా మార్చే విధానాన్ని పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. బయోచార్‌ను తగిన మోతాదులో సేంద్రియ ఎరువులతో కలిపి వ్యవసాయ భూముల్లో వినియోగించడం ద్వారా నేల నాణ్యత, సేంద్రియ పదార్థాల స్థాయిని మెరుగుపరిచే అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. భూసార పరిరక్షణతో పాటు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నంద్యాల జిల్లాలో తొలిసారిగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించి, దాని ఫలితాలను శాస్త్రీయంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ఫోర్ రెడ్డి ఫౌండేషన్, క్లైమిత్ర అండ్ సర్క్యులారిటీ బయో తరఫున జిల్లావ్యాప్తంగా ఈ ప్రాజెక్టును అమలు చేసేందుకు రూపొందించాల్సిన ప్రతిపాదనలను వారం రోజుల్లో సమర్పించాలని కలెక్టర్ సూచించారు.కోర్ టీమ్ సభ్యులు అందించే సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని, రాబోయే 3 నుంచి 6 నెలల్లో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో కార్యక్రమాన్ని అమలు చేసి, దాని ఫలితాలను అంచనా వేయాలని కలెక్టర్ తెలిపారు. రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా, పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. బయోచార్ నేలలో కార్బన్‌ను స్థిరీకరించడంతో పాటు దీర్ఘ కాలికం గా నేల నాణ్యతను మెరుగుపరిచే సామర్థ్యం కలిగి ఉందని వివిధ అధ్యయనాలు సూచిస్తున్న నేపథ్యంలో, నంద్యాల జిల్లాలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా దీని వినియోగ సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కేవలం ఒక ప్రాజెక్టుగా కాకుండా పంట అవశేషాల నిర్వహణ,భూసార పరిరక్షణ, సేంద్రియ వ్యవసాయం , పర్యావరణ పరిరక్షణను అనుసంధానించే సమగ్ర చర్యగా ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంబంధిత కంపెనీల ప్రతినిధులు రాజశేఖర్ రెడ్డి, అంకిత శర్మ, రవిచంద్ర, నాబార్డ్ ఏజీఎం కార్తికేయ, ఎల్డియం అయ్యప్ప రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు ఫార్మర్ ఐడీ కలిగి ఉండాలి



సెప్టెంబర్ 23 వార్త సాక్ష్యం

ప్రతి రైతు ఫార్మర్ ఐడీ (రైతు రిజిస్ట్రేషన్ సంఖ్య) కలిగి ఉండాలని, ఫార్మర్ ఐడీ ఉంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ పథకాలకు అర్హత పొందే అవకాశం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి తిరుమల రావు తెలిపారు. బుధవారం ముండ్లమూరు మండలంలోని సింగన్నపాలెం, ముండ్లమూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలుకు పొలం చేసుకునే రైతులందరూ సీసీఆర్సీ కార్డులు పొందాలని సూచించారు. అర్హులైన కౌలు రైతులు సంబంధిత వీఆర్వోలను సంప్రదించి కౌలు కార్డులు పొందాలని తెలిపారు. కౌలు రైతులు సైతం తాము సాగు చేస్తున్న పంటలను నమోదు చేసుకోవచ్చని వివరించారు. ప్రతి రైతు ఫార్మర్ ఐడీ కలిగి ఉండాలని, ఫార్మర్ ఐడీ కోసం రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఫార్మర్ ఐడీ ఉంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ పథకాల ప్రయోజనాలు పొందేందుకు అర్హత ఉంటుందని తెలిపారు. రైతులకు వ్యవసాయ సంబంధితంగా ఏవైనా సమస్యలు ఎదురైతే మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వీరాంజనేయులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎఫ్ఎంటీ యోగేశ్వరమ్మ, ఐసీఆర్పీలు రవి, పేరయ్య చౌదరి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# రైతులకు వ్యవసాయాధికారి సూచనలు



సెప్టెంబర్ 23 వార్త సాక్ష్యం

మండలంలోని తిక్కిరెడ్డిపాలెం, ప్రత్తిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణ బేగం రైతులకు పలు సూచనలు చేశారు.ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతు సెప్టెంబర్ 30వ తేదీలోపు తమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పత్తి పంటకు మొదటి దఫా ఎరువులు వేసుకోవచ్చని తెలిపారు. 30-35 కిలోల యూరియా, 10-15 కిలోల పొటాష్ ఎరువులను 7-10 సెంటీ మీటర్ల లోతులో పాదులు తీసి వేయాలని సూచించారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలైన కందులు, మినుములు, రాగులు, కొర్ర విత్తనాలు 80 శాతం సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులందరూ రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి సూచించారు.

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కొండయ్య శంకుస్థాపన

సెప్టెంబర్ 23 వార్త సాక్ష్యం



పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ చీరాల మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య శంకుస్థాపన చేశారు. 28, 29వ వార్డుల్లో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.17.05 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులకు ఆయన శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణంతో ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడతాయని అన్నారు. చీరాల నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధుల సాధన, ప్రజలకు మౌలిక వసతుల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి చీరాల పట్టణాన్ని ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే మాలకొండయ్యకు ప్రశంసలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన జిల్లా కలెక్టర్





- పెద్ద ఎత్తున ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న అధికారులు
- ఆయుర్వేదం మన సంప్రదాయ వైద్య విజ్ఞానంలో ముఖ్యమైన భాగశీ
- ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- సాంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానాల పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి
- జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా

నంద్యాల, సెప్టెంబర్ 23 వార్త సాక్ష్యం

ఆయుర్వేదం మన సంప్రదాయ వైద్య విజ్ఞానంలో ముఖ్యమైన భాగం అని సాంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానాలపై ప్రతి ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా తెలిపారు. ఆయుర్వేద దినోత్సవాన్ని,పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యుల సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ లోనే పి జి ఆర్ ఎస్ హాలు నందు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం బుధవారం జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ HB, bone density వంటి తదితర టెస్టులు చేయించుకున్న అనంతరం వైద్యులు జిల్లా కలెక్టర్ కు మందులు అందజేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ఆయుర్వేదం, ఆయుష్ వైద్య విధానాల ప్రాధాన్యతను ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లైఫ్ సైన్స్ విద్యార్థిగా డిగ్రీ విద్యను అభ్యసిస్తున్న సమయంలో బోటనీ, మెడిసిన్ తదితర సబ్జెక్టుల ద్వారా ఆయుర్వేదం, నేచురోపతి, హోమి యోపతి, యునాని,సిద్ధ వంటి వివిధ వైద్య విధానాల గురించి తెలుసుకున్నానని తెలిపారు. ఆయుర్వేదం మన సంప్రదాయ వైద్య విజ్ఞానంలో ముఖ్యమైన భాగమని తెలిపారు. ప్రస్తుత ఆధునిక జీవనశైలి కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతు న్నాయని అన్నారు. ఉద్యోగులు ఎక్కువ సమయం కార్యాలయాల్లో కూర్చుని పనిచేయడం, సుదీర్ఘ గంటల పాటు పనిచేయడం, వేళకు ఆహారం తీసుకోకపోవడం, రాత్రి వేళల్లో ఎక్కువసేపు మేల్కొని ఉండటం వంటి అలవాట్ల వల్ల నడుము నొప్పి, డిస్క్ సంబంధిత సమస్యలు, జుట్టు రాలడం, గొంతు సమస్యలు తదితర ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకుంటూ, నడుము మరియు డిస్క్ సంబంధిత సమస్యల ఉపశమనానికి డాక్టర్ యశోధర సూచించిన కర్పూర తైలం ఉపయోగించడం ద్వారా ప్రయోజనం పొందిన ట్లు తెలిపారు. అలాగే నిద్రకు సంబంధించిన ఇబ్బందులు, మానసిక ఒత్తిడి వంటి సమస్యల విషయంలో ఆయుర్వేద వైద్యుల సలహా మేరకు అశ్వగంధ చూర్ణం ఉపయోగించారని తెలిపారు. పసుపు,ఉసిరి వంటిసహజ పదార్థాలకు ఆయుర్వేదం లో ఉన్న ప్రాధాన్యతను జిల్లా కలెక్టర్ వివరించారు. గొంతు సంబంధిత సమస్యలకు సీతోఫలాది చూర్ణం వంటి ఆయుర్వేద ఔషధాలను వైద్యుల సలహాతో వినియోగించడం ద్వారా ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చిన వెంటనే స్వయంగా టాబ్లెట్లు తీసుకోవడం, అవసరం లేక పోయినా అధిక మొత్తంలో మందులు కొనుగోలు చేసి సగం ఉపయోగించి వృథా చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు వైద్యుల ను సంప్రదించి, అవసరమైన చికిత్స మేరకు మాత్రమే తీసుకోవాలని తెలిపారు.ఆయుర్వేదం సహా వివిధ వైద్య విధానాలను వైద్యుల సూచనల మేరకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజలు కుటుంబ సమేతంగా ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్యుల సలహాలు, అవసరమైన ఔషధాలను ఉచితం గా పొంది శిబిరాన్ని సద్వినియోగం



చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ధన్వంతరి యంత్ర చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

జిల్లా ఆయుష్ అధికారి మాట్లాడుతూ

వయస్సు పెరుగుతున్న కొద్దీ జీవనశైలి, ఒత్తిడి, హార్మోన్లలో వచ్చే మార్పుల కారణంగా ఎముకల సాంద్రత తగ్గే అవకాశం ఉంటుందని, నడుము, మెడ, మోకాళ్ల నొప్పులు వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. వయస్సునునియంత్రించలేక పోయినా, సమతుల్య ఆహారం, క్రమబద్ధమైన వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి ద్వారా ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రాచీన ఆయుర్వేదంలో ఆరోగ్యకరమైన జీవన విధానానికి ఆహారంతో పాటు సామాజిక ప్రవర్తన, ఒత్తిడి లేని జీవనం, పెద్దల సలహాలను పాటించడం వంటి అంశాలకు కూడా ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో అవసరమని అన్నారు. ప్రతి పనిని ఇష్టపడి, సాను కూల దృక్పథంతో స్వీకరించినప్పుడు మానసిక ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. దీర్ఘకాలిక ఒత్తిడి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ఒత్తిడిని నియంత్రించుకోవడం, తగిన విశ్రాంతి తీసుకోవడం, సమయానికి ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి అలవాట్లను పెంపొందించుకోవాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి వచ్చే వారిలో నడుము,మెడ, మోకాళ్ల వంటి కీళ్ల నొప్పులు, మధుమేహ సమస్యల తో వస్తున్నట్లు వైద్యుల పరిశీలనలో వెల్లడైందని తెలిపారు. ఆయుర్వేద వైద్య విధానంలో ఆరోగ్య పరిరక్షణకు, వ్యక్తి శారీరక పరిస్థితికి అనుగుణంగా చికిత్సా విధానాలను అనుసరిస్తారని వైద్యులు నొప్పులు లేదా ఇతర ఆరోగ్య సమస్యలకు స్వయంగా మందులు వినియోగించకుండా అర్హత కలిగిన వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు చికిత్స పొందాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో ఆయుర్వేదంలో వినియోగించే ప్రత్యేక తైలాలు, ఇతర చికిత్సా విధానాలను వైద్యుల సలహాతో మాత్రమే ఉపయోగించుకోవాలని తెలిపారు. ఉచిత వైద్య శిబిరం నందు నాడీ పరీక్ష , Bone Mineral Density, HB తదితర టెస్టులు చేయించుకున్న వారిని వైద్యుల సలహా మేరకు ప్రతి ఒక్కరికి మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆయుర్వేద, హోమియో వైద్యులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# శాప్ ఆఫీస్ వద్ద దాడి పై అన్ని ఆధారాలతో గవర్నర్‌కు ఫిర్యాదు

ఈ వ్యవస్థలో ఒక మార్పు రావాలన్నా, ఈ వ్యవస్థ మీద ప్రజలకు మళ్లీ నమ్మకం రావాలన్నా, ఈ వ్యవస్థలో లోపాలు సవరించాలన్నా డీఎస్సీ స్కామ్‌పై కచ్చితంగా సీబీఐ విచారణ జరిపించే విధంగా చొరవ తీసుకోవాలని వివరించారు విద్యా శాఖ మంత్రి రాజీనామా కూడా చేయాలి. అంటూ మీడియా ముందు విమర్శలు చేశారు. దేశ చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా, నాలుగు పాయింట్ల ఆధారంగా డీఎస్సీలో అక్రమాలు చోటు చేసుకున్నాయి, మొట్ట మొదట రెండు ఫంక్షన్లు ఒకే వ్యక్తి చేతికి అప్పగించడం. ప్రశ్నపత్రం తయారీ, పరీక్ష నిర్వహణ రెండూ ఎస్సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు అప్పగించారు. దీంతో స్కామ్ ప్రారంభం అయింది.ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల చేతిలో పెట్టారు. అలా పని చేస్తున్న నవీన్ అనే వ్యక్తికి కృష్ణా జిల్లాలో ఫస్ట్ ర్యాంక్ వచ్చినా, అతడికి ఉద్యోగం ఇవ్వలేదు. తన పేరు తొలి మెరిట్ లిస్ట్‌లో చూపి, ఆ తర్వాత లిస్ట్‌లో పేరు తొలగించారు. అతడి లాగిన్ ఐడీ బ్లాక్ చేశారు. కాల్ లెటర్ కూడా పంపలేదు. దీంతో అతడు ప్రభుత్వానికి లేఖ రాయడమే కాకుండా, కోర్టుకు కూడా వెళ్లాడు. అంటే ఒక స్కామ్‌ను కవర్ చేయడానికి ఎన్ని అగచాట్లు పడుతున్నారు. అనేది తెలియడంతో పాటు, లీకేజీ వ్యవహారం బట్టబయలైంది,స్పోర్ట్స్ కోటా పేరుతో అడ్డగోలుగా జీఓలు ఇచ్చారు. గతంలో ఉన్న జీఓలు రద్దు చేసి కొత్తగా.. జీఓ నెం: 4, 47 అని చెప్పి, రెండు కొత్త జీఓలు తెచ్చి, వాటి ద్వారా పరీక్ష రాయాల్సిన అవసరం లేకుండా ఉద్యోగాలు ఇచ్చారు. ఆ తర్వాత 372 ఉద్యోగాలు ఆ జీఓల పేరుతో ఇచ్చారు. ఆ రిక్రూట్‌మెంట్ పూర్తి కాగానే మళ్లీ మూడు జీఓలు తెచ్చారు. జీఓ నెం: 23, 25, 56 తెచ్చారు. దాని ప్రకారం మళ్లీ పరీక్ష ఉండాలని నిబంధన పెట్టారు. మరి ఇక్కడ 372 మందికి ఎలా ఉద్యోగాలు ఇచ్చారన్న దానికి సమాధానం లేదు. ఫేక్ సర్టిఫికెట్లు. ఏరకంగా నారా లోకేష్ తోడల్లుడు, విశాఖ ఎంపీ భరత్ దొంగ సర్టిఫికెట్లు ఇచ్చాడో చూశాం. జరగని గేమ్స్ జరిగినట్లు చూపారు. అలాగే ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అయిన ఎమ్మెల్యే కూన రవికుమార్.. దాదాపు 38 ఉద్యోగాలకు సంబంధించి, సర్టిఫికెట్లు ఇచ్చారనేది కూడా చెప్పాం. ఇంకాసాఫ్ట్‌బాల్ అసోసియేషన్లకు సంబంధించి కొన్ని జిల్లాలో సెక్రటరీలకు, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చారు అనేవి కూడా చెప్పాం.

**బేరసారాల ఆడియో.వీడియో:**

డీఎస్సీ ఉద్యోగాలకు సంబంధించి బేరసారాలపై ఆడియో, వీడియో కూడా బయటకు వచ్చింది. అందులో క్లియర్‌గా ఫోన్ నెంబర్ కనిపిస్తున్నా, ఆ వ్యక్తి గురించి ఎఫ్ఐఆర్‌లో రాయలేదు. కేవలం సస్పెక్ట్ అని మాత్రమే రాశారు. అరెస్టు కూడా



చేయకుండా స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. అయినా సీఎం చంద్రబాబు అసెంబ్లీలో అబద్ధాలు చెప్పారు.

**శాప్ ఆఫీస్ వద్ద టీడీపీ గుండాల దాడి:**

సెప్టెంబరు 21న శాప్ ఆఫీస్ వద్ద శాంతియుత నిరసన వ్యక్తం చేస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముందుగానే సమాచారం ఇచ్చారు. అనుమతి కోరుతూ లెటర్ కూడా రాశాడు. కానీ, ఆరోజు ఏం జరిగింది. అక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ఎలా కుట్ర చేశారో చూశాం. టీచర్లు కాని టీచర్లను పిలిపించి, ప్యారలల్‌గా ధర్నా చేయించాడు. నిజానికి వారు చదువు చెప్పే గురువులు కాదు. దొంగ సర్టిఫికెట్లతో, ఏ పరీక్ష రాయకుండా ఉద్యోగాలు పొందిన వారు. అందుకే వారు టీచర్లు కానీ టీచర్లు. వారిని పిలిపించి, కావాలని శాప్ ఆఫీస్ వద్ద గొడవ చేయించారు. అంతే కాకుండా టీడీపీ గుండాలను కూడా అక్కడికి రప్పించారు. వారంతా కలిసి మా పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువకులపై దారుణంగా దాడి చేశారు. అసలు వారంతా ఎవరో చూడండి. వీరు గతంలో సాక్షి ఆఫీస్‌పై దాడి చేసింది. పైగా రివర్స్ కేసులు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న మా పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువకులపై ఆ విధంగా టీడీపీ గుండాలు అంత దారుణంగా దాడి చేసినా, వారిపై ఎలాంటి చర్యలు లేవు. వారిపై కేసులు నమోదు చేయలేదు. అందుకు పూర్తి భిన్నంగా, రివర్స్‌లో మా పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువకులపై కేసు పెట్టారు.ఎంత దారుణంగా ఆ కేసులు పెట్టారంటే.. హత్యాయత్నం కేసులు. ఎస్సీ ఎస్టీ అత్యాచార కేసులు పెట్టారు. ఇప్పటికే 350 మందిపై కేసులు పెట్టారు. ఆ జాబితా ఇంకా పెరుగుతోంది. ఇంకా రాత్రి వేళల్లో ఇళ్లపై బడి అరెస్టులు చేస్తున్నారు. అయితే అదృష్టవశాత్తూ. కోర్టులు వాటిని తప్పు పడుతున్నాయి. దీని వల్ల సామాన్యులు బ్రతుకుతున్నారు. మరోవైపు మొన్నటి శాంతియుత నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేశారు. వాటిపైనా



కోర్టులు స్పందించాయి. శాంతియుత నిరసన వ్యక్తం చేస్తుంటే, రౌడీ షీట్లు ఎలా ఓపెన్ చేస్తారని నిలదీశాయి.

**మా పోరాటం కొనసాగుతుంది:**

తప్పు చేసింది మీరు. ప్రశ్నించే హక్కు లేదా? దాన్ని కూడా కాల రాస్తారా? ఇంత దిక్కుమాలిన ప్రభుత్వం ప్రపంచంలోనే ఉండదేమో.. మా ఈ యుద్ధం కొనసాగుతుంది. ఇందులో న్యాయం, ధర్మం తప్పకుండా గెలుస్తుంది. విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి. దీనిపై సీబీఐ విచారణ జరగాలి. కనీసం అప్పుడైనా మన రాష్ట్రంలో పిల్లలకు, నిరుద్యోగులకు పరీక్షల మీద విశ్వాసం ఏర్పడుతుంది.పోటీ పరీక్షలు పారదర్శకంగా జరుగుతాయన్న నమ్మకం కలుగుతుంది. ఆ దిశలో మా డిమాండ్ కొనసాగుతోంది.

**మీడియా ప్రశ్నలకు బదులిస్తూ సుప్రీంకోర్టు ఆదేశం ప్రభుత్వానికి చెంపదెబ్బ:**

విజయవాడలో సాయికృష్ణ లాకప్‌డెత్‌కు సంబంధించిన కేసు చూస్తే.. ఏ రకంగా చంద్రబాబు ప్రభుత్వం పిల్లలను వాడుకుంటూ, వారితో గంజాయి అమ్మిస్తూ, వారితో చట్టవిరుద్ధమైన పనులు చేయించారు?. ఇందులో పోలీసులు ఎలా పని చేశారు? ప్రభుత్వం ఎలా అధికార దుర్వినియోగం చేస్తోంది అనేదానికి నిదర్శనం.సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో సుప్రీంకోర్టు ఈరోజు ఇచ్చిన ఆదేశాలు. అవి నిజంగా ఒక చెంపదెబ్బ చంద్రబాబు ప్రభుత్వం మీద. సుప్రీంకోర్టు గట్టిగా మందలిస్తూ.. సీపీ, డీజీపీని కూడా ఎందుకు అక్యూజ్డ్ లిస్టులో చేర్చలేదని నిలదీయడం.. నిజంగా ప్రభుత్వానికి చెంపదెబ్బ. ఒక పిల్లాడిని అరెస్టు చేసి తీసుకొస్తారు. కొట్టి చంపారు. చివరకు శవం కూడా మాయం చేశారు. చంద్రబాబు ప్రభుత్వంలో, రెడ్‌బుక్ రాజ్యాంగంలో నగరం మధ్యలో ఏ విధంగా దారుణాలు జరుగుతున్నాయి అని చెప్పడంతో పాటు, పోలీసుల అరాచకాలకు ఇవన్నీ నిదర్శనంలా నిలుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు.

# ఈ నెల 25వ తేదీలోగా బ్యాంకింగ్ లావాదేవీలు పూర్తి చేసుకోవాలి

**- సెప్టెంబర్ 28, 29 మరియు 30 తేదీలలో దేశవ్యాప్త బ్యాంకు ఉద్యోగుల సమ్మె, నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లు**

**- నంద్యాల జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ బి. అయ్యపురెడ్డి**

నంద్యాల సెప్టెంబర్ 23 వార్త సాక్ష్యం

యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 28, 29 మరియు 30 తేదీలలో దేశవ్యాప్త బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో, నంద్యాల జిల్లాలో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలగకుండా అన్ని బ్యాంకులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని బ్యాంకులకు నంద్యాల జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్. బి.అయ్యపురెడ్డి తెలిపారు. అదే విధంగా సెప్టెంబర్ 26 నాల్గవ శనివారం, సెప్టెంబర్ 27 ఆదివారం కావడంతో,26 నుంచి 30 వరకు వరుసగా ఐదు రోజుల పాటు సాధారణ బ్యాంకు శాఖల కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున, ప్రజలకు అవసరమైన ముఖ్యమైన బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండేలా బ్యాంకులు తగిన SLBC మార్గదర్శకాలు Business Continuity Plan అమలు చేయాలని సూచించారు.

బ్యాంకులకు ముందస్తు ఏర్పాట్లపై సూచనలు. బి. అయ్యపురెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని బ్యాంకులు కింది చర్యలను ముందుగానే చేపట్టాలని తెలిపారు,ఎన్టీఆర్ భరోసా పింఛన్లు,అన్ని బ్యాంకులు సెప్టెంబర్ నెల పింఛన్ల చెల్లింపులకు సంబంధించి సంబంధిత ప్రభుత్వ శాఖలు/పెన్షన్ పంపిణీ అధికారులతో సమన్వయం చేసుకొని ఎటువంటి అంతరాయం లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలి.నగదు లభ్యత ముఖ్యమైన శాఖలు, నగదు పంపిణీ కేంద్రాల్లో ఖాతాదారుల అవసరాలకు



అనుగుణంగా తగినంత నగదు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

- ATM\T మరియు CRMs: జిల్లాలోని ATMలు, Cash Recycler Machines లో తగినంత నగదు ఉండేలా ముందస్తు క్యాష్ లోడింగ్ మరియు రీప్లెనిష్మెంట్ ఏర్పాట్లు చేయాలి.
- నిరంతర పర్యవేక్షణ: ATM\T/CRMsలో నగదు లభ్యతను నిరంతరం పర్యవేక్షించి, అవసరమైన చోట వెంటనే నగదు భర్తీ చేసే విధంగా contingency arrangements ఏర్పాటు చేయాలి.
- డిజిటల్ బ్యాంకింగ్: Internet Banking, Mobile Banking, UPI తదితర డిజిటల్ బ్యాంకింగ్ సేవలు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా బ్యాంకులు అవసరమైన అంతర్గత ఏర్పాట్లు చేసుకోవాలి.
- ప్రభుత్వ చెల్లింపులు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పింఛన్లు మరియు ఇతర ప్రభుత్వ ఆధారిత చెల్లింపుల్లో లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకోవాలి.




- ప్రజలకు ముందస్తు సమాచారం: బ్యాంకు సమ్మె మరియు వరుస సెలవుల పరిస్థితిని ఖాతాదారులకు ముందుగానే తెలియజేసి, ప్రత్యామ్నాయ డిజిటల్ బ్యాంకింగ్ సదుపాయాలను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలి.

**ప్రజలకు లీడ్ బ్యాంక్ మేనేజర్ సూచన**

నంద్యాల జిల్లా ప్రజలు సెప్టెంబర్ 25,లోగా తమకు అవసరమైన ముఖ్యమైన బ్యాంకింగ్ లావాదేవీలను పూర్తి చేసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ సూచించారు. ముఖ్యంగా నగదు ఉపసంహరణలు, డిపాజిట్లు, చెక్కుల లావాదేవీలు, రుణ వాయిదాల చెల్లింపులు, ప్రభుత్వ/ఇతర ముఖ్యమైన చెల్లింపులు అవసరమున్న వారు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే పూర్తి చేసుకోవాలని కోరారు. అత్యవసర అవసరాల కోసం ప్రజలు ATMలు, Cash Recycler Machines, UPI, Internet Banking, Mobile Banking తదితర డిజిటల్ మరియు ప్రత్యామ్నాయ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. నంద్యాల జిల్లాలో బ్యాంకింగ్ సేవలకు సాధ్యమైనంత వరకు అంతరాయం కలగకుండా అన్ని బ్యాంకులు ముందస్తు చర్యలు చేపట్టాలని, ఖాతాదారులకు అవసరమైన సహకారం అందించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ బి. అయ్యపురెడ్డి సూచించారు.

# రెవెన్యూ సేవల పై ఆర్డీఓ దిశానిర్దేశం

**- పలు అంశాల పై సిబ్బందితో ఆర్డీఓ హరికుమార్ సమీక్ష**



సెప్టెంబర్ 23 వార్త సాక్ష్యం

బాపట్ల సబ్ డివిజన్ పరిధిలోని రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలపై ఆర్డీఓ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సబ్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందితో ఆర్డీఓ హరికుమార్ సమావేశమై ఆరు ప్రధాన అంశాలపై సమీక్షించారు.రీ సర్వే, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్–పీపీపీ), నిషేధిత భూములు, అర్హులందరికీ ఇళ్లు, పట్టాదారు పుస్తకాల పంపిణీ తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. రెవెన్యూ శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు, ఫైళ్ల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రజల నుంచి అందుతున్న వినతులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆర్డీఓ హరికుమార్ అధికారులకు సూచించారు. రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు నిషేధిత భూములకు సంబంధించిన సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, పట్టాదారు పుస్తకాల పంపిణీ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అన్ని అంశాలకు సంబంధించి నిర్దేశించిన గడువులో పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించాలని ఆర్డీఓ హరికుమార్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# కూటమి ప్రభుత్వం కార్యకర్తలకు అండ

**- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల బీమా చెక్కులు అందజేసిన జీవీ ఆంజనేయులు**



సెప్టెంబర్ 23 వార్త సాక్ష్యం

టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ఆపద సమయంలో అండగా నిలిచి ఆర్థిక భరోసా కల్పించాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రమాద బీమా పథకం ద్వారా మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల ఆర్థిక సహాయం అందజేసినట్లు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. వినుకొండ పట్టణంలోని తన కార్యాలయంలో టీడీపీ కుటుంబ సభ్యుల ప్రమాద బీమా పరిహారం చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.నూజెండ్ల మండలం ములకలూరు గ్రామానికి చెందిన సాంసోను మంద, బొల్లాపల్లి మండలం సరికొండపాలెం గ్రామానికి చెందిన కొండబోయిన నాగేశ్వర రావు అకాల మరణం పట్ల జీవీ ఆంజనేయులు సంతాపం వ్యక్తం చేశారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రమాద బీమా పథకం కింద మంజూరైన పరిహారం చెక్కులను మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇరు కుటుంబాలకు చెరో రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.10 లక్షల బీమా పరిహారాన్ని జీవీ ఆంజనేయులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం రూ.100 సభ్యత్వంతో టీడీపీ కుటుంబంలో చేరిన ప్రతి కార్యకర్తకు, వారి కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఆపద సమయంలో కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రమాద బీమా పథకం ప్రధాన ఉద్దేశమని జీవీ ఆంజనేయులు వివరించారు. కూటమి ప్రభుత్వం కార్యకర్తల సంక్షేమానికి చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అక్రమ నిల్వ పై అధికారుల కొరడా

సెప్టెంబర్ 23 వార్త సాక్ష్యం

కొల్లూరు మండలం, కొల్లూరు గ్రామంలోని ఉప్పు బజార్‌లో ఓ ఇంట్లో అనధికారికంగా నిల్వ ఉంచిన 13 గృహావసర గ్యాస్ సిలిండర్లు, మూడు వాణిజ్య గ్యాస్ సిలిండర్లను పౌరసరఫరాల శాఖ అధికారులు సీజ్ చేశారు.జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఏ. జగన్మోహన్‌రావు, సివిల్ సప్లైస్ డీటీ ఫణికుమార్, గ్రామ రెవెన్యూ అధికారి రామారావు తదితరులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనధికారికంగా నిల్వ చేసిన మొత్తం 16 గ్యాస్ సిలిండర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన సిలిండర్లను భద్రతా చర్యల్లో భాగంగా కొల్లూరులోని వసుంధర ఇండియన్ గ్యాస్ సంస్థకు తగిన రసీదు తీసుకుని అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# బిజినెస్

## సెబీతో అదానీ సెటిల్‌మెంట్




అదానీ గ్రూపునకు మరో పెద్ద ఊరట లభించింది. గ్రూపు షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని, అదానీ కంపెనీలు సంబంధిత పార్టీలతో లావాదేవీలకు సంబంధించిన కీలక సమాచారాన్ని కూడా వెల్లడించకుండా నిబంధనలను అతిక్రమించాయంటూ అమెరికా హెడ్జ్ ఫండ్ హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణల నుంచి పూర్తి విముక్తి లభించింది. సంబంధిత పార్టీలతో లావాదేవీల సమాచార వెల్లడిలో నిబంధనల అతిక్రమణల ఆరోపణలపై జరిపిన దర్యాప్తులో భాగంగా సెబీ తీసుకునే న్యాయపరమైన చర్యల నుంచి అదానీ గ్రూపు పూర్తిగా తప్పించుకుంది. ఇందుకోసం అదానీకి చెందిన ఐదు కంపెనీలు సెబీకి రూ.1.5 కోట్లు చెల్లించి ఈ వ్యవహారాన్ని సెటిల్ చేసుకున్నాయి. ఇంతకు ముందు అమెరికా సెక్యూరిటీస్ ఎక్చేంజ్ కమిషన్ (ఎసఈసీ)తోనూ అదానీ గ్రూపు ఇలాగే సెటిల్ చేసుకుంది. కార్పొరేట్ కంపెనీలపై వచ్చే ఆరోపణలపై సెబీ లాంటి నియంత్రణ సంస్థలు దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటాయి. అయితే, నియంత్రణ సంస్థలు చర్యలు తీసుకోక ముందే, కంపెనీలు కొంత మొత్తాన్ని చెల్లించి ఆ విషయానికి ఫుల్‌స్టాప్ పెట్టవచ్చు. ఇందుకోసం తనపై వచ్చిన ఆరోపణలను ఒప్పుకోవడంగానీ, తిరస్కరించడంగానీ చేయనవసరం లేదు. దీన్నే సెటిల్‌మెంట్ అంటారు. 2023 జనవరిలో అమెరికా హెడ్జ్ ఫండ్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్.. అదానీ గ్రూపుపై చేసిన ఆరోపణలు ఆ గ్రూపు కంపెనీల షేర్లను నేలమట్టం చేశాయి. గ్రూపు ప్రధాన ప్రమోటర్ గౌతం అదానీ తన సన్నిహిత బంధువుల ద్వారా గ్రూపులోని ఐదు లిస్టెడ్ కంపెనీల షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరుపుతున్నారని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. దీనిపై సెబీతో సహా అనేక సంస్థలు దర్యాప్తు చేసినా, చివరికి పెద్దగా ఏమీ తేల్చలేదు.

## 'ఉడాన్ 2.0'తో రూ.60,000 కోట్ల బూస్ట్




దేశంలో ప్రాంతీయ విమానయానాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రారంభించిన 'ఉడాన్ 2.0' పథకంపై కేంద్ర ప్రభుత్వం చాలా ఆశలు పెట్టుకుంది. ఈ పథకం ద్వారా విమానయాన రంగంలోకి రూ.60,000 కోట్ల వరకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ పెట్టుబడులే రూ.30,000 కోట్ల వరకు ఉంటాయన్నారు. మిగతా మొత్తం రాష్ట్ర ప్రభుత్వాలు, విమానయాన సంస్థల ద్వారా రావచ్చన్నారు. ఉడాన్ 2.0 పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాలతో జరిగిన అవగాహన ఒప్పందాల (ఎంఓయూ) కార్యక్రమంలో ఆయన ఈ విషయాలు వెల్లడించారు. ఈ పథకం కింద ప్రాంతీయ విమానాశ్రయాల అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో సహా 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు విమాన శాఖ, భారతీయ విమానాశ్రయాల నిర్వహణ సంస్థ (ఏఏఐ)తో ఎంఓయూలు కుదుర్చు కున్నాయి. స్పైస్‌జెట్‌పై డీజీసీఏ పర్యవేక్షణ : ఆర్థిక కష్టాల్లో ఉన్న స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్స్ నిర్వహణ, ఆర్థిక పరిస్థితులను పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్టు రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఇప్పటికే ఆ సంస్థకు అత్యవసర పరపతి హామీ పథకం (ఈసీఎల్‌జీఎస్) కింద రూ.150 కోట్లు సమకూర్చినట్టు తెలిపారు. ప్రస్తుత గిరాకీ దృష్ట్యా మన దేశంలో ఒక్కొక్కటీ 100 విమానాలతో కూడిన ఐదు విమానయాన సంస్థల అవసరం ఉందని రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఎయిర్‌పోర్టు ఆపరేటర్లకు ఎయిర్‌లైన్స్‌లో వాటాపై త్వరలో నిర్ణయం: విమానాశ్రయాల నిర్వహణ సంస్థలు ఎయిర్‌లైన్స్‌లో వాటా కలిగి ఉండడంపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మంత్రి తెలిపారు. అన్ని విషయాలను పరిశీలించాకే ఈ ప్రతిపాదనపై తుది నిర్ణయం తీసుకుం టామన్నారు. ప్రస్తుతానికైతే ఎయిర్‌పోర్టుల ఆపరేటర్లు దేశీయ విమానయాన సేవల సంస్థల్లో వాటా కలిగి ఉండడంపై ఎలాంటి నిషేధం లేదన్నారు.పండుగ సీజన్‌లో సముచిత చార్జీలు. పండుగ సీజన్‌లోనూ విమానయాన సంస్థల చార్జీలు సముచితంగా ఉండాలని రామ్మోహన్ నాయుడు కోరారు. అలాగని చార్జీలపై గరిష్ఠ పరిమితి విధించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదన్నారు. పండుగలు, ఇతర రద్దీ సమయాల్లో విమాన చార్జీలను పెంచేస్తున్న నేపథ్యంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం గమ నార్హం. అయితే చార్జీల పెంపుపై ప్రభుత్వం ఎప్పటి కప్పుడు విమానయాన సంస్థలతో చర్చిస్తూనే ఉందన్నారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఎయిర్‌లైన్స్‌ల ఇంధన వ్యయాలూ భారీగా పెరిగిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు.

## ఈ నెల 28 నుంచి 30 వరకు బ్యాంకులు బంద్




బ్యాంకు వినియోగదారులకు అతి ముఖ్యమైన వార్త. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు బ్యాంకు ఉద్యోగుల సమ్మె జరగనుంది. అయితే సెప్టెంబర్ 27న ఆదివారం మాత్రం బ్యాంకులు పని చేస్తాయి. వారానికి ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. సెప్టెంబర్ 22న జరిగిన చర్చల్లోనూ పరిష్కారం లభించకపోవడంతో సమ్మె కొనసాగుతుందని యూనియన్లు ప్రకటించాయిఈ సమ్మె తేదీలకు ముందు సెప్టెంబర్ 26 నాలుగో శనివారం, సెప్టెంబర్ 27 ఆదివారం ఉన్నాయి. ఆ తర్వాత సెప్టెంబర్ 28-30 వరకు సమ్మె జరగనుంది. అయితే బ్యాంకు ఉద్యోగుల సమ్మె కారణంగా ఆర్బీఐ, కీలక శాఖ కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఆదివారం నాడు బ్యాంకులు పని చేయనున్నాయి. వినియోగదారులకు ఇబ్బందులు కలగకూడదనే భావనతోనే ఈ నిర్ణయం తీసుకున్నాయి. సమ్మె సమయంలో కూడా యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి సేవలు మాత్రం అందుబాటులో ఉంటాయి . స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ ఇప్పటికే తమ కస్టమర్లకు సమ్మె నేపథ్యంలో సూచనలు జారీ చేశాయి . శాఖల్లో నేరుగా చేసే పనులకు ఆటంకం కలిగినా డిజిటల్ సర్వీసులు యథాతథంగా పని చేస్తాయని తెలిపాయి. నగదు అవసరమున్న కస్టమర్లు ఏటీఎంలను ఉపయోగించుకోవచ్చని తెలిపాయి. కాగా, సెప్టెంబర్ 28-30 సమ్మెతో సమస్య పరిష్కారం కాకపోతే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు బ్యాంకు యూనియన్లు ప్రకటించాయి.ఖ

## వాళ్లిద్దరూ ప్రపంచ కప్ గెలవాలని దేశం మొత్తం కోరుకుంటోంది: రింకూ సింగ్



విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ 2027 వన్డే ప్రపం చకప్‌లో భారత్ తరఫున ఆడాలని దేశం మొత్తం కోరుకుంటోందని టీమిండియా బ్యాటర్ రింకూ సింగ్ అన్నాడు. ఇద్దరూ దిగ్గజ ఆటగాళ్లని పేర్కొన్న అతడు.. 2027 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిస్తే అది దేశానికే కాకుండా కోహ్లీ, రోహిత్‌కు కూడా ఎంతో ప్రత్యేకమైన సందర్భమవుతుందని చెప్పాడు. "విరాట్ భయ్యా, రోహిత్ భయ్యా ఇద్దరూ లెజెండ్స్. వాళ్లు ప్రపంచకప్‌లో ఆడాలని నా ఒక్కడి కోరిక కాదు.. దేశం మొత్తం కోరుకుంటోంది. వాళ్లు జట్టులో ఉండి భారత్‌ను ప్రపంచకప్ విజేతగా నిలిపితే ఎంతో గొప్పగా ఉంటుంది. అది వాళ్లకు చివరి ప్రపంచకప్ కావచ్చేమో. 2011 తర్వాత భారత్ వన్డే ప్రపంచకప్ గెలవలేదు. అందుకే వాళ్లిద్దరూ జట్టుతో ఉండి ట్రోఫీ గెలిస్తే ఎంతో ప్రత్యేకం" అని జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రింకూ చెప్పాడు. ఐపీఎల్ 2023లో గుజరాత్ టైటాన్స్‌పై వరుసగా ఐదు సిక్సర్లు బాదడంతో రింకూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. అయితే తనను కేవలం ఆ ఐదు సిక్సర్లతోనే గుర్తించకూడదని అతడు అంటున్నాడు. భారత్ తరఫున ప్రపంచకప్ గెలవడంలో భాగస్వామి కావడమే ప్రస్తుతం తన ప్రధాన లక్ష్యమని చెప్పాడు. బ్యాటింగ్‌తో జట్టుకు ఉపయోగపడుతూ మరిన్ని ప్రపంచకప్ విజయాల్లో భాగం కావాలని కోరుకు ంటున్నట్లు తెలిపాడు. ఇక తాను కేవలం టీ20 ఆటగాడిననే అభిప్రాయాన్ని కూడా రింకూ ఖండించాడు. దేశవాళీ క్రికెట్‌లో వన్డేలు, నాలుగు రోజుల మ్యాచుల్లోనూ ఆడుతున్నానని చెప్పాడు. భారత్ తరఫున టెస్టుల్లో అరంగేట్రం చేయాలన్నది తన కల అని వెల్లడించాడు. ప్రస్తుతం భారత్ తరఫున ఒక్క ఫార్మాట్‌లోనే ఆడుతున్నా.. మూడు ఫార్మాట్ల లోనూ రాణించగలనని విశ్వాసం వ్యక్తం చేశాడు. కెప్టెన్సీపై కూడా రింకూ స్పందించాడు. యూపీ లీగ్‌లో తన జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి టైటిల్ గెలిచానని గుర్తుచేశాడు. గత సీజన్‌లో ఐపీఎల్‌లో వైస్ కెప్టెన్‌గా ఉన్నానని చెప్పాడు. అజింక్య రహానె, సూర్యకుమార్ యాదవ్ వంటి ఆటగాళ్ల నుంచి నాయకత్వ లక్షణాలు నేర్చుకుంటున్నానని తెలిపాడు. కెప్టెన్సీలో ఇంకా ఎదగాల్సి ఉందని పేర్కొన్నాడు.

# స్పోర్ట్స్

## ఆస్ట్రేలియా బౌలింగ్‌ను ఎదుర్కోవాలంటే అదే కీలకం: గంభీర్



ఆస్ట్రేలియా జట్టులోని అనుభవజ్ఞులైన బౌలింగ్ దాడిని ఎదుర్కోవాలంటే భారత యువ బ్యాటర్లకు నైపుణ్యంతో పాటు మానసిక దృఢత్వం ఎంతో అవసరమని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. ఒత్తిడిని ఎంతగా తట్టుకోగలిగితే అంత మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని చెప్పాడు. 2027 జనవరి 21 నుంచి మార్చి 3 వరకు భారత్-ఆస్ట్రేలియా మధ్య ఐదు టెస్టుల బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ జరగనుంది. అనుభవజ్ఞులైన బౌలర్లతో పరీక్ష పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, నాథన్ లియాన్ లాంటి బౌలర్లతో కూడిన ఆస్ట్రేలియా బౌలింగ్ విభాగం భారత యువ బ్యాటర్లకు గట్టి పరీక్ష పెట్టనుందని గంభీర్ పేర్కొన్నాడు. నాగ్‌పుర్, చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్ వేదికలుగా టెస్టులు జరగనున్నాయి. "టెస్టుల్లో నైపుణ్యం ముఖ్యం. కానీ మానసికంగా ఎంత బలంగా ఉన్నాం? ఒత్తిడిని ఎంతగా భరించగలం? అన్నదే కీలకం. ఒత్తిడిని స్వీకరించి ముందుకు వెళ్లగలిగితే అవకాశాలు మెరుగవుతాయి" అని గంభీర్ అన్నాడు. శ్రీలంకలో ముందస్తు సన్నాహాల ఫలితం కఠిన సిరీస్‌లకు ముందస్తు ప్రణాళికతో సిద్ధమైతే ఫలితాలు స్పష్టంగా కనిపిస్తాయని గంభీర్ చెప్పాడు. శ్రీలంక పర్యటనను ఇందుకు ఉదాహరణగా చూపాడు. అక్కడ టెస్టులకు పది రోజుల ముందే చేరుకుని స్పిన్‌ను ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా సాధన చేశామని తెలిపాడు.

## సంజూ శాంసన్ విషయంలో ఆ రాత్రి నిద్రపోలేదు: గౌతమ్ గంభీర్




టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా సంజూ శాంసన్‌ను జట్టు నుంచి తప్పించడం తన రెండేళ్ల కోచింగ్ కెరీర్‌లోనే అత్యంత కఠినమైన నిర్ణయమని, ఆ రాత్రి తాను నిద్ర కూడా పోలేకపోయానని తెలిపాడు. వెస్టిండీస్‌తో సిరీస్ ప్రారంభానికి ముందు జియోస్టార్‌తో మాట్లాడుతూ గౌతీ ఈ వ్యాఖ్యలు చేశాడు.ఈ ఏడాది టీ20 ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచిన సంజూ శాంసన్‌ను, ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్ అనంతరం జట్టు నుంచి తప్పించిన సంగతి తెలిసిందే. అతని స్థానంలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇచ్చారు. అయితే, ఆ తర్వాత ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన సిరీస్‌లో తిరిగి జట్టులోకి వచ్చిన సంజూ, వరుసగా అర్ధ శతకాలతో సత్తా చాటాడు.ఈ నిర్ణయంపై గంభీర్ మాట్లాడుతూ.. "నా రెండేళ్ల కోచింగ్ ప్రయాణంలో ఆ ఒక్క రాత్రే నేను నిద్రపోలేకపోయాను. ఈ విషయాన్ని నేను సంజూతోనే చెప్పాను. ఎందుకంటే టీ20 ఫార్మాట్‌లో నా కోచింగ్ కెరీర్‌లో అది అత్యంత కఠినమైన నిర్ణయం. ప్రపంచకప్ హీరో అయిన ఆటగాడిని కేవలం మూడు, నాలుగు మ్యాచ్‌ల తర్వాత పక్కనపెట్టాల్సి వచ్చింది. ఆ సమయంలో వైభవ్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. సిరీస్ గెలవాలంటే మాకు టాపార్డర్‌లో పరుగులు అవసరమయ్యాయి. సంజూతో నేను చాలా నిజాయతీగా మాట్లాడాను. అతను కూడా దాన్ని సానుకూలంగా స్వీకరించాడు" అని వివరించాడు.అదే సమయంలో వైభవ్ వంటి యువ ఆటగాళ్లు తమ అవకాశం కోసం వేచి ఉండాలని గంభీర్ స్పష్టం చేశాడు. "సోషల్ మీడియా లేదా బయటి గోల తుది జట్టును నిర్ణయించదు. డ్రెస్సింగ్ రూమ్‌లో కెప్టెన్, కోచ్ కలిసి.. ఎవరైతే మ్యాచ్ గెలిపిస్తారని భావిస్తామో వారికే అవకాశం ఇస్తాం. రెండు సంవత్సరాలుగా నిలకడగా రాణిస్తున్న ఆటగాళ్లను కొన్ని వైఫల్యాలకే పక్కనపెట్టి, డ్రెస్సింగ్ రూమ్‌లో అభద్రతాభావాన్ని సృష్టించలేం. ప్రజాదరణ పొందే నిర్ణయాలు తీసుకోవడం సులభం, కానీ సరైన నిర్ణయాలు తీసుకోవడమే కష్టం. మేము సరైన నిర్ణయమే తీసుకున్నాం" అని గంభీర్ పేర్కొన్నాడు.ఈ సందర్భంగా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌పై గంభీర్ ప్రశంసలు కురిపించాడు. "కేకేఆర్ కెప్టెన్‌గా శ్రేయస్‌లో నాకు నచ్చిన ప్రధాన లక్షణం అతని నిస్వార్థం. జట్టు ప్రయోజనాల కోసం తన నాలుగో బ్యాటింగ్ స్థానాన్ని కూడా వదులుకోవడానికి సిద్ధపడేవాడు. ఒక కెప్టెన్ ఇలా చేయడం చాలా అరుదు. ఒక మంచి నాయకుడికి ఉండాల్సిన మొట్టమొదటి లక్షణం నిస్వార్థం. అది శ్రేయస్‌లో పుష్కలంగా ఉంది" అని కొనియాడాడు. ఒకటి రెండు ఓటములతో జట్టును అంచనా వేయలేమని, జట్టులో కొనసాగింపు చాలా ముఖ్యమని గంభీర్ స్పష్టం చేశాడు.

# చరిత్ర సృష్టించిన ‘మండాడి’ సినిమా

# 100 కోట్ల క్లబ్ లోకి సూరి, సుహాస్ మూవీ






హాస్య నటుడి నుంచి కథానాయకుడిగా మారి వైవిధ్యభరిత చిత్రాలతో మెప్పిస్తున్న తమిళ నటుడు సూరి, టాలీవుడ్ హీరో సుహాస్ నటించిన ‘మండాడి’ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైన ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా, అద్భుతమైన ప్రజాదరణతో ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని దాటింది. కథానాయకుడిగా సూరి కెరీర్‌లో రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన తొలి చిత్రంగా ‘మండాడి’ ఘనత సాధించినట్లు నిర్మాణ సంస్థ ఆర్ఎస్ ఇన్ఫోటైన్మెంట్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడించింది. దర్శకుడు మదిమారన్ పుగ ళేంది తెరకెక్కించిన ఈ చిత్రంలో తీరప్రాంత పడవల పోటీలు, మత్స్యకారుల జీవితం, భావోద్వేగాలను ప్రధానంగా చూపించారు. తెలుగు నటుడు సుహాస్ ఈ చిత్రం ద్వారా తమిళ సినీ రంగ ప్రవేశం చేయడమే కాకుండా నెగెటివ్ పాత్రలో తన నటనతో ప్రశంసలు అందుకున్నారు. వీరితో పాటు మహిమా నంబి యార్, సత్య రాజ్, రవీంద్ర విజయ్ కీలక పాత్రల్లో మెప్పించారు. సముద్రం మధ్య లో చిత్రీకరించిన ఉత్కంఠభరితమైన పడవల పోటీ ఘట్టాలు, జీవీ ప్రకాశ్ కుమార్ అందించిన సంగీతం, ఎస్. ఆర్.కథిర్ ఛాయాగ్రహణం ఈ చిత్ర విజ యానికి ప్రధాన బలాలుగా నిలిచాయి. ప్రేక్షకుల ఆదరణే ఈ అపార విజయా నికి కారణమని చిత్ర బృందం కృతజ్ఞతలుతెలిపింది.

## ‘ఆ రోజు మా జీవితాలనే మార్చేసింది’.. చిరంజీవిపై రామ్‌చరణ్ ఎమోషనల్ పోస్ట్

మెగాస్టార్ చిరంజీవి సినీ రంగంలోకి అడుగుపెట్టి 48 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆయన కుమారుడు, హీరో రామ్‌చరణ్ భావోద్వేగ పోస్ట్ చేశాడు. తండ్రి సినీ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నాడు. 50 ఏళ్ల మైలురాయిని కలిసి జరుపుకునే రోజు కోసం ఎదురు చూస్తున్నానని చెప్పాడు.“నాన్నా.. మీరు సినిమాల్లోకి వచ్చి 48 ఏళ్లు పూర్తయ్యాయి. మా కుటుంబం మొత్తాన్నీ మార్చేసిన ఆ రోజును మేం ఎప్పటికీ గుర్తు చేసుకుంటాం. మీరు చేసిన ప్రతిదానికీ కృతజ్ఞతలు. ఇన్నేళ్లుగా మీపై ప్రేమ చూపిస్తున్న ప్రేక్షకులకు కూడా ధన్యవాదాలు. మీ ప్రయాణం ఎప్పటికీ మాకు స్ఫూర్తే. ఇప్పుడు 50 ఏళ్ల సినీ ప్రస్థానాన్ని జరుపుకొనే రోజు కోసం ఎదురుచూస్తున్నా” అని చరణ్ పేర్కొన్నాడు. చిరంజీవి 1978లో ‘ప్రాణం ఖరీదు’ సినిమాతో తెరపైకి వచ్చాడు. అప్పటి నుంచి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించాడు. అగ్ర కథానాయకుడిగా ఎదిగాడు. మెగాస్టార్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. 48 ఏళ్ల ప్రస్థానం పూర్తైన సందర్భంగా చిరంజీవి కూడా అభిమానులకు కృతజ్ఞతలు తెలిపాడు. తనకు అవకాశాలు ఇచ్చిన నిర్మాతలు, కొత్త పాత్రలు చూపించిన దర్శకులు, తోటి నటులు, సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు చెప్పాడు. అయితే విజయాలు, అవార్డుల కంటే అభిమానులు తనపై చూపించిన ప్రేమే ఎంతో గొప్పదని చిరంజీవి అన్నాడు. అభిమానులు తనను కుటుంబ సభ్యుడిగా భావించడం తనకు ఎంతో విలువైన విషయమని చెప్పాడు. వారి ప్రేమ వల్లే ‘చిరంజీవి’ అనే పేరు తనకు శాశ్వత గుర్తింపుగా మారిందని పేర్కొన్నాడు.



## ‘ప్యారడైజ్’.. నిజమైన ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బంది లేదన్న నాని




తన తాజా చిత్రం ‘ది ప్యారడైజ్’ విడుదలపై వచ్చిన కోర్టు ఉత్తర్వుల విషయంలో నేచురల్ స్టార్ నాని పూర్తి స్పష్టత ఇచ్చారు. బెంగళూరు కోర్టు ఇచ్చిన ఇంజంక్షన్ ఆర్డర్ కేవలం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాయంతో సృష్టించిన ఫేక్ పోస్టులు, బాట్లకు మాత్రమే వర్తిస్తుందని, నిజమైన ప్రేక్షకుల అభిప్రాయాలకు కాదని తేల్చి చెప్పారు. సినిమా చూసి తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా పంచుకునే హక్కు ప్రేక్షకులకు ఎప్పుడూ ఉంటుందని ఆయన అన్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన ‘ది ప్యారడైజ్’ సినిమా టీజర్ విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో కొందరు కావాలనే ఏఐ టెక్నాలజీ ఉపయోగించి నకిలీ, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు పోస్ట్ చేస్తున్నారని నిర్మాతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో, నిర్మాత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పీ బెంగళూరు సివిల్ అండ్ సెషన్స్ కోర్టును ఆశ్రయించగా, సెప్టెంబర్ 19న న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయంపై ముంబైలో జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో నాని మాట్లాడుతూ... కొంతమంది డబ్బులు ఇచ్చి బాట్లతో, ఏఐ టెక్నాలజీతో దుష్ప్రచారం చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పోరాటం అలాంటి వారిపైనే తప్ప, నిజమైన సినీ ప్రియులపై కాదని ఆయన వివరించారు. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు తమ విమర్శలను, అభిప్రాయాలను ఎలాంటి భయం లేకుండా చెప్పవచ్చని భరోసా ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా రేపు (సెప్టెంబర్ 24) ‘ది ప్యారడైజ్’ విడుదల కానుంది. ఇప్పటికే సెప్టెంబర్ 23 రాత్రి పలు నగరాల్లో ప్రత్యేక ప్రీమియర్ షోలు ప్రారంభమయ్యాయి. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.